నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
మంగళవారం | జులై 16, 2024 | www.navatelangana.com

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు జిల్లా విద్యార్థులు

నవతెలంగాణ-మంచిర్యాల



పట్టణంలోని ట్రినిటీ హైస్కూల్‌లో నిర్వహించిన తైక్వాండో పోటీల్లో గెలిచిన విద్యార్థులకు సోమవారం జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. జిల్లా స్థాయిలో మొదటి, రెండవ స్థానంలో నిలిచిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బుచ్చి రామారావు, వెంకటస్వామి, మండ శ్రీనివాసులు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు కృషిత్, దుగుట రూపేష్ ఎంపికయ్యారన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు అభినందించారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన హాకీ క్రీడాకారులకు సన్మానం

ఉట్నూర్ : జాతీయ స్థాయి సబ్ జూనియర్ హాకీ పోటీల్లో రాష్ట్ర జట్టుకు ఎంపికైన గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాల విద్యార్థులను సోమవారం ఐటీడీఏ పిఓ కుష్బూ గుప్తా తన ఛాంబర్‌లో శాలువాలతో సత్కరించారు. ఎంపికైన వారిలో పుషం మోతీరాం, చవాన్ సాయిరాం, ఆత్రం జగ్జీవన్, జాదవ్ చరణ్, ఆత్రం శంభు, రాథోడ్ ధనరాజ్ ఉన్నారు. వీరు ఈ నెల 19 నుండి 29 వరకు కేరళ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయిలో పోటీల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీలో పాల్గొనే రాష్ట్ర జట్టులో ఏకంగా ఆరుగురు గిరిజన ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. జాతీయ స్థాయిలో చక్కటి ప్రతిభ కనబర్చాలని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో డిడి దిలీప్‌కుమార్, ఎపిఓ ఆత్రం భాస్కర్, జిల్లా క్రీడల అధికారి పార్థసారథి, కోచ్ సునంద ఉన్నారు.



పాఠం నేర్పని పార్కు..!


- మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలిన సైన్స్ పార్కు
- చెట్ల పొదలు, చెత్తాచెదారంలో కలిసిపోయిన పరికరాలు
- రూ.35లక్షల నిధులు వృథా..పట్టించుకోని అధికారులు
- తాజాగా మరో రూ.23లక్షలతో పునర్నిర్మాణం

విద్యార్థులకు విజ్ఞానం నేర్పిస్తుందని ఏర్పాటుచేసిన సైన్స్ పార్కు ఎందుకు పనికిరాకుండా పోయింది. అధికారుల పట్టింపులేమి కారణంగా ఏర్పాటుచేసిన ఈ విజ్ఞాన పార్కు మూన్నెళ్లలోనే అతీగతి లేకుండా పోయింది. ఈ పార్కు నిర్మాణం కోసం వెచ్చించిన రూ.35లక్షల నిధులు వృథాపాలయ్యాయి. సైన్స్ పరికరాలు తుప్పుపట్టి..పిచ్చిమొక్కలు..చెత్తాచెదారం మధ్య కలిసిపోయి పనికిరాకుండా పోయాయి. ఎవరూ పట్టించుకోకపోవడంతో ఐదేండ్లు గడుస్తున్నా అలాగే ఉండిపోయింది. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా ఏర్పాటుచేసిన ఈ సైన్స్ పార్కు నిర్మాణం పట్ల తొలుత అందరిలోనూ ఆసక్తి ఉండేది. కానీ నిర్మాణ లోపాలతో పాటు నిర్వహణ మరిచిపోవడంతో ఈ పార్కు దిక్కుతోచని పరిస్థితిలో ఉండిపోయింది. సైన్స్ పరికరాలను స్వయంగా చూస్తూ విజ్ఞానం నేర్చుకుందామని భావించిన విద్యార్థులకు అందని ద్రాక్షగానే మారింది. రూ.35లక్షలతో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన సైన్స్ పార్కు దుస్థితిపై ప్రత్యేక కథనం..


పిచ్చిమొక్కల మధ్య సైన్స్ పరికరాలు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సైన్స్ పార్కును ఏర్పాటుచేశారు. జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల 26గుంటల విశాలమైన ఖాళీ స్థలం ఉండటంతో ఇక్కడ విజ్ఞాన పార్కు ఏర్పాటుచేస్తే బాగుంటుందని అప్పటి జిల్లా కలెక్టర్ దివ్యాదేవరాజన్ భావించారు. కర్ణాటకలోని బెంగళూరులో డా.ఏపీజే అబ్దుల్‌కలాం పేరిట విజ్ఞాన పార్కు ఉండటంతో ..ఆ పార్కు మాదిరిగానే ఇక్కడ కూడా ఆయన పేరిటనే సైన్స్ పార్కును ప్రారంభించారు. భౌతిక, రసాయన శాస్త్రానికి సంబంధించిన పరికరాలను కేవలం పుస్తకాల్లో చదవడమే కాకుండా ద్రవ్యరాశి జడత్వం, గ్రహాల గమనాన్ని తెలిపే పరికరం, పిరియాడిక్ టేబుల్, పెరిస్కోప్ వంటి పరికరాల పనితీరును స్వయంగా తెలుసుకునేందుకు వీలుగా 2018-19 ఏడాదిలో రూ.35లక్షల ప్రత్యేక నిధులతో ఈ పార్కును ఏర్పాటుచేశారు. జిల్లా విద్యామౌళిక వసతుల అభివృద్ధి సంస్థ(టీజీఈడబ్ల్యూఐడీసీ) ఆధ్వర్యంలో పనులను ఓ గుత్తేదారుకు అప్పగించారు. కొన్ని రోడ్లు వేయడంతో పాటు వివిధ రకాల సైన్స్ పరికరాలను బిగించారు. ప్రారంభించిన తొలినాళ్లలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు స్వయంగా ఇక్కడకు వచ్చి ఈ పార్కును సందర్శించి విషయాలు తెలుసుకునేవారు.



నిరుపయోగంగా పడి ఉన్న సైన్స్ పరికరాలు

మూన్నెళ్లలోనే మూతపడింది..!

ఈ పార్కులో మిగితా అభివృద్ధి పనులు చేపట్టకపోవడం.. వర్షాకాలంలో బురదమయంగా మారడంతో పిచ్చిమొక్కలు వెలిశాయి. కొన్ని రోజుల పాటు పర్యవేక్షించిన అధికారులు, సిబ్బంది అనంతరం ఈ పార్కు నిర్వహణను పూర్తిగా వదిలేశారు. నాటిన చెట్లతో పాటు బిగించిన పరికరాలకు కూడా రక్షణ లేకపోవడంతో పనికిరాకుండా పోయాయి. ప్రస్తుతం ఈ పార్కులో పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడం, చెత్తాచెదారం పోగుకావడంతో దుర్గంధం వెదజల్లుతోంది. అటువైపు ఎవరూ కన్నెత్తిచూడకపోవడంతో అసలు ఇక్కడ పార్కు ఉందా..? అనే అనుమానం కలిగేలా మారింది. విద్యాశాఖ అధికారులతో పాటు ఇంజనీరింగ్ అధికారులు సైతం దీనిపై దృష్టిసారించకపోవడం మూలంగా ఈ పార్కు అధ్వాన్న స్థితిలో ఉండిపోయింది.

మరో రూ.23లక్షలతో పునర్నిర్మాణం..?

విద్యార్థులకు విజ్ఞానాన్ని పంచే ఈ పార్కు పరిస్థితిపై ప్రస్తుత జిల్లా కలెక్టర్ దృష్టిసారించినట్లు తెలిసింది. మళ్లీ ఈ పార్కు పునర్నిర్మాణం చేపట్టాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. ఇందుకు అయ్యే వ్యయం వివరాలను సమర్పించాలని ఆదేశించడంతో అధికారులు వివిధ పనులు చేపట్టేందుకు రూ.23లక్షల వరకు ఖర్చు అవుతుందని ప్రతిపాదనలు సమర్పించారు. పిచ్చిమొక్కల తొలగింపు..భూమి లెవలింగ్‌తో పాటు సీసీ రోడ్ల నిర్మాణం తదితర వాటిని చేపట్టాల్సి ఉంటుందని అధికారులు నివేదిక అందించినట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. ఈ పార్కు మళ్లీ అందుబాటులోకి తీసుకొస్తే విద్యార్థులకు విజ్ఞానం అందించడమే కాకుండా జిల్లాకు కూడా మంచి పేరు వస్తుందని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

రజకులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

- రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య



నవతెలంగాణ-మందమర్రి

రజకుల సంక్షేమానికి పథకాలు అమలు చేసి ఆర్థికంగా బలోపేతం చేయాలని రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వీటీసీ మైదానంలో రజక వృత్తిదారుల పట్టణ సర్వసభ్య సమావేశం సంఘం నాయకుడు సంగెపు హనుమంతు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశయ్య మాట్లాడారు. రాష్ట్రంలో లక్షలాది మంది రజక వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రజకులకు సంక్షేమ పథకాలు అమలు చేసి ఆర్థికంగా బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు. రజక వృత్తిని ఆధునీకరించి మోడ్రన్ లాండ్రీ షాపులకు రూ.10లక్షల ఆర్థిక సహకారం అందించాలని, రజక ఫెడరేషన్‌కు పాలక వర్గాన్ని నియమించి రజక సొసైటీలకు నేరుగా రుణాలు అందించాలని తెలిపారు. పట్టణంలో ఏర్పాటు చేసిన మోడ్రన్ లాండ్రీ వాషింగ్ ప్లాంట్‌కు నిధులు లేక ఆగిపోయిందని, అవసరమైన నిధులు కేటాయించి మరమ్మతులు పూర్తి చేయాలని కోరారు. రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి పాయిరాల రాములు మాట్లాడుతూ సామాజిక భద్రతకు రజకులకు ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని, ఇందిరమ్మ పథకం వర్తించే విధంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నూతనంగా మందమర్రి పట్టణ అధ్యక్షులుగా గంగరాజుల రామచంద్రాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ముష్కర చందర్, భాగ్య, పట్టణ నాయకులు బండి పాపయ్య, నర్సయ్య, రామకృష్ణాపూర్ నాయకులు రాజేశ్వరి, రజిత, పెనుగొండ సమ్మయ్య, రాములు పాల్గొన్నారు.

రుణమాఫీకి నిబంధనలతో కాంగ్రెస్ మోసం

నవతెలంగాణ-నిర్మల్

ఎటువంటి నిబంధనలు లేకుండా రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నిబంధనల పేరుతో రైతులను మోసం చేస్తోందని ఎమ్మెల్యే, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రీషెడ్యూల్ అయిన రుణాలకు మాత్రమే రుణమాఫీ ఇస్తామని అంటున్నారని, చాలా బ్యాంకులు లోన్ రికవరీ అయ్యి మళ్లీ కొత్తగా లోన్ ఇచ్చినట్టు రైతు పుస్తకాల్లో రాసుకుంటాయని తెలిపారు. వాటి కి వర్తించదని చెప్పడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. బ్యాంకర్లు చేసిన తప్పిదాలకు రైతులు బలి అవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని, రేషన్‌కార్డు అనే నిబంధన పెట్టి చాలా మందికి ఎగొట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఒకే రేషన్‌కార్డుతో ఉన్న అన్నదమ్ములు భూములు పంచుకొని విడివిడిగా రుణాలు తీసుకుంటారని, వారి పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఎటువంటి నిబంధనలు పెట్టకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

కళ్యాణలక్ష్మి పథకాన్ని అందించిన ఘనత కేసీఆర్‌దే

నవతెలంగాణ-సిరికొండ

పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్ల కోసం కళ్యాణలక్ష్మి పథకాన్ని అందించిన ఘనత కేసీఆర్‌దేనని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆనాడు పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్ల కోసం, నిరుపేదల కష్టాన్ని గుర్తించి కళ్యాణలక్ష్మీ పథకాన్ని ప్రవేశపెట్టి దేశంలోనే చరిత్ర సృష్టించారని తెలిపారు. లబ్ధిదారులు కళ్యాణలక్ష్మీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్ కుమార్, నాయకులు పెంటన్న, సూర్యకాంత్, రోహిదాస్, మల్లేష్, మల్లారెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గుట్కా తరలిస్తున్న కంటైనర్ పట్టివేత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గుట్కా తరలిస్తున్న కంటైనర్ వాహనాన్ని మావల పోలీసులు ఆదివారం రాత్రి పట్టుకున్నారు. ఢిల్లీ నుంచి కర్ణాటకకు రూ.16లక్షల విలువైన గుట్కాను వే బిల్లులతో పట్టణంలోని టైలర్స్ కాలనీకి తరలించడాన్ని గుర్తించి పట్టుకున్నారు. గుట్కాతో పాటు వాహనాన్ని సీజ్ చేసినట్లు డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. గుట్కా వ్యాపారులు తప్పుడు బిల్లులతో పట్టణంలో పలుచోట్ల గుట్కాను నిల్వ చేస్తున్నట్లు పేర్కొన్నారు. స్థానిక గుట్కా వ్యాపారి షమ్ము ఆ వాహనాన్ని తెప్పించినట్లుగా ప్రాథమిక విచారణలో వెల్లడైందని పేర్కొన్నారు. దీంతో పోలీసులు అతనితోపాటు డ్రైవర్, క్లీనర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. దాడిలో మావల ఎస్ఐ విష్ణువర్ధన్, పోలీసులు పాల్గొన్నారు.

గొడిసిర్యాలలో ఎంపీ నగేష్ ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-దస్తురాబాద్

ఎంపీ గోడెం నగేష్ మండలంలోని గొడిసిర్యాల రాజరాజేశ్వర ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ పూజరి లక్ష్మణస్వామి, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అంకం మహేందర్, మండల అధ్యక్షులు కొడిమెల లక్ష్మణ్, బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నగేష్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించిన సందర్భంగా బీజేపీ శ్రేణులు ఎంపీ నిలువెత్తు బంగారం(బెల్లం)తో తులాభారం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి సాగర్‌గౌడ్, బీజేపీ సీనియర్ నాయకులు దాదే మల్లయ్య, మాజీ జడ్పీటీసీ, రాజు, మాజీ ఐటీడీఏ చైర్మన్ తులసీరాం, మాజీ సర్పంచులు హనుమాగౌడ్, సత్యం, కొమ్ము రాంచందర్, బీజేపీ నాయకులు చుంచు రాజేందర్, ఒగ్గే రాజన్న, కొత్త శంకర్ పాల్గొన్నారు.

జాబ్ క్యాలెండర్ పేరుతో కాంగ్రెస్ మోసం

నవతెలంగాణ-నిర్మల్

కాంగ్రెస్ అధికారంలో కొస్తే జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని చెప్పి నిరుద్యోగులను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తోందని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి, అడ్వకేట్ జగన్‌మోహన్ సోమవారం ఓ ప్రకటనలో విమర్శించారు. ఎన్నికలకు ముందు హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో జరిగిన యూత్ డిక్లరేషన్ సభలో నాటి పీసీసీ అధ్యక్షుడు, నేటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రతి ఏడాది జూన్ రెండో తేదీ కల్లా ఖాళీ ఉద్యోగాలకు జాబ్ క్యాలెండర్ ప్రకటించి, సెప్టెంబర్ 17లోగా నియామకాలు పూర్తి చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన సంవత్సరం రెండు లక్షల ఉద్యోగాలతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ బ్యాక్ లాక్ పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించారని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా జాబ్ క్యాలెండర్ ప్రకటించకుండా, ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. నిరుద్యోగ భృతి ఎప్పటి నుంచి ఇస్తారని ప్రశ్నించారు.

ఉపాధ్యాయుల మధ్య గొడవ

బడికి తాళాలు వేసిన గ్రామస్తులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్


ఎంఈఓతో మాట్లాడుతున్న గ్రామస్తులు

ఉపాధ్యాయుల విచక్షణ లేకుండా పాఠశాలలో గొడవ పడడంతో విద్యార్థులు భయంతో గ్రామంలోకి పరుగులు తీశారు. గ్రామస్తులు వచ్చి పాఠశాలకు తాళం వేయడం మండలంలో కలకలం రేపింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని సాలెగూడ గ్రామ ప్రాథమిక పాఠశాలలో 60 మంది విద్యార్థులు విద్య నభ్యసిస్తున్నారు. ప్రధానోపాధ్యాయుడు అనంతరావు, గతంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయునిగా పనిచేసి ప్రస్తుతం ఉపాధ్యాయునిగా ఉన్న తిరుపతి మధ్య గత శుక్రవారం గొడవ జరిగింది. ఒకరిపై ఒకరు పాఠశాలలోనే దాడి చేసుకోవడంతో భయకంపితులైన విద్యార్థులు గ్రామంలోకి పరుగులు తీశారు. తల్లిదండ్రులకు తెలియజేయడంతో పలువురు వెంటనే పాఠశాలకు చేరుకున్నారు. అప్పటికే ఇరువురు పాఠశాల నుండి వెళ్లిపోయారు. శని ఆదివారాలు సెలవు దినాలు కావడంతో సోమవారం గ్రామస్తులు పాఠశాలకు చేరుకొని విషయం తెలుసుకోవడానికి ప్రయత్నం చేశారు. సమస్య తీవ్రతను అర్థం చేసుకొని ఉన్నతాధికారులు స్పందించాలనే ఉద్దేశంతో పాఠశాలకు తాళం వేశారు. పాఠశాల అభివృద్ధి నిధుల్లో భాగంగా ఇరువురి మధ్య గొడవ వచ్చినట్లు గ్రామస్తులు తెలియజేశారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులు పాఠశాల వేదికగా కొట్టుకోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన గ్రామస్తులు పాఠశాలకు తాళం వేసినట్లు వివరించారు. సదరు ఉపాధ్యాయులను పాఠశాల నుండి తొలగించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ప్రధానోపాధ్యాయుడు సోమవారం పాఠశాలకు రాకపోవడంతో గ్రామస్తులు పాఠశాల వద్ద బైటాయించారు. మండల విద్యాధికారి మనుకుమార్ అక్కడికి చేరుకొని గ్రామస్తులను ఒప్పించే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ గ్రామస్తులు ఒప్పుకోకపోవడంతో మంగళవారం గ్రామస్తుల సమక్షంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులతో మాట్లాడతానని, గొడవకు గల కారణాలు తెలుసుకొని కారణమైన వారిపై చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో అక్కడి నుండి వెళ్లిపోయారు. మంగళవారం ఉదయం 10గంటలకు పాఠశాలకు రావాలని గ్రామస్తులకు సూచించారు.


తాళం వేస్తున్న గ్రామస్తులు

భార్య గొంతు కోసిన భర్త



నవతెలంగాణ-బేల




మండలంలోని సైద్‌పూర్ గ్రామంలో విషాదం నెలకొంది. సోమవారం కుటుంబ కలహాలతో భార్యాభర్తల మధ్య ఇంటి దగ్గర గొడవ జరిగింది. అది కాస్త పెద్దది కావడంతో భర్త ఎల్చాల లక్ష్మణ్ కత్తితో భార్య సునీత గొంతు కోశాడు. అనంతరం అదే కత్తితో తానూ గొంతు కోసుకున్నాడు. భార్య అక్కడికక్కడే చనిపోగా భర్త ప్రాణాలతో కొట్టుమిట్టడుతున్నాడు. స్థానికులు అంబులెన్సుకు ఫోన్ చేసి జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి, జైనథ్ సీఐ సాయినాథ్, బేల పోలీసులతో సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. సునీత, లక్ష్మణ్ ఎనిమిదేండ్ల క్రితం కులాంతర వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. భార్యపై అనుమానంతోనే గొంతు కోసి ఉంటాడని ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్టు పోలీసులు తెలిపారు. సునీత తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

పెన్షన్‌దారుల సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టరేట్ ఎదుట పెన్షనర్ల నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ప్రభుత్వ పెన్షన్‌దారుల జేఏసీ కోకన్వీనర్ శశికాంత్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట జేఏసీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ కోకన్వీనర్ శశికాంత్ మాట్లాడుతూ పెన్షన్‌దారులకు పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే చెల్లించాలన్నారు. కార్పొరేట్ ఆస్పత్రులలో నగదురహిత వైద్యం అందించాలని పేర్కొన్నారు. వెల్‌నెస్ సెంటర్‌లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్యేలకు ఏ విధంగా ఆదాయ పన్నులో మినహాయింపు ఇస్తున్నారో పెన్షనర్‌లకు అదే విధంగా వర్తింపజేయాలన్నారు. ఈ నెల 30న ఇందిరా పార్కు వద్ద మౌనప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ సుధాకర్, సభ్యులు దయాకర్‌రెడ్డి, రాజేశ్వర్, మాదం గంగాధర్, ప్రేమ్‌కుమార్, ఎండీ మస్తాన్, మురళీధర్, జగన్మోహన్, చంద్రకాంత్ పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు రూ.4వేల జీవనభృతి ఇవ్వాలి

- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.జనార్ధన్
- కలెక్టరేట్ ఎదుట కార్మికుల నిరసన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



బీడీ కార్మికులందరికీ కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రూ.4వేల జీవన భృతి ఎలాంటి ఆంక్షలు లేకుండా వెంటనే అమలు చేయాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.జనార్ధన్ డిమాండ్ చేశారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో బీడీ కార్మికులు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ బీడీ పరిశ్రమ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఆంక్షలు లేకుండా బీడీ పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులందరికీ జీవనభృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ కార్మికులకు అనేక ఆంక్షలు విధించి తీవ్ర ఇబ్బంది కలిగించారని తెలిపారు. బీడీ పరిశ్రమను దెబ్బతీయడానికి నరేంద్ర మోడీ ప్రభుత్వం రకరకాల చర్యలను చేపట్టి, సిగరెట్ కంపెనీలకు ఊడిగం చేస్తోందని మండిపడ్డారు. బీడీ కట్టలపై పుర్రె గుర్తు ముద్రించి బీడీ కార్మికుల జీవనోపాధిని దెబ్బ తీస్తూ, సిగరెట్ పరిశ్రమ అధిపతులకు ఊడిగం చేస్తోందని విమర్శించారు. మోడీ ఎన్నికల్లో ఉపాధి భద్రత, స్వదేశీ పరిశ్రమల పరిరక్షణ, ప్రతి ఏటా రెండు కోట్ల కొలువులు ఇస్తామని వాగ్దానాలు చేసి, కార్మిక వ్యతిరేక విధానాలతో కార్పొరేట్ కంపెనీలకు సేవ చేస్తోందని తెలిపారు. మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి హక్కులను కాల రాస్తోందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం బీడీ పరిశ్రమపై విధించిన ఆంక్షలను తొలగించాలని, జీఎస్టీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బి.భూమన్న, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్య శివాజీ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.హరిత, జిల్లా నాయకులు బి.వెంకట నారాయణ, గంగమ్మ, తారాబాయి, పీఓడబ్ల్యూ జిల్లా కన్వీనర్ దుర్గం కళావతి, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మడావి గణేష్, జిల్లా సహాయ కార్యదర్శి కనాకె దత్తు, పీవైఎల్ జిల్లా నాయకులు మారుతి, ప్యాకర్స్, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
మంగళవారం | జులై 16, 2024 | www.navatelangana.com

మంత్రి ఉత్తంను కలిసిన రూపేష్‌రెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తం కుమార్‌రెడ్డిని ఆదిలాబాద్ అసెంబ్లీ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం హైదరాబాద్‌లోని వ్యవసాయ సహకార సంఘం భవనంలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. జిల్లాలోని నీటిపారుదలకు సంబంధించిన సౌకర్యాలను ఇరిగేషన్ వివరాలను రైతులను నాయకులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో రైతులందరికీ సాగునీరు అందేలా పూర్తి బాధ్యత వహిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సకాలంలో చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. మంత్రిని కలిసిన వారిలో మండలం కిసాన్ సెల్ అధ్యక్షుడు ఘనశ్యామ్ ఉన్నారు.

గిరి యువకుడిని సన్మానించిన సీఎం

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని బేతాల్‌గూడ గ్రామపంచాయతీ పరిధిలోని సోనాపూర్ గ్రామానికి చెందిన గిరిజన యువకుడు రాథోడ్ పృథ్వీరాజ్ జాతీయ స్థాయిలో షూటింగ్ పోటీలో ప్రతిభ కనబరిచి నాలుగు పతకాలు సాధించాడు. ఈనెల 8న గోవాలో జరిగిన పదో అంతర్జాతీయ రైఫిల్ పిస్తోల్ షూటింగ్ లో రాథోడ్ పృథ్వీరాజ్ ఒక బంగారు, రెండు సిల్వర్, ఒక బ్రాంజ్ మెడల్ సాధించాడు. ఆయనను తెలంగాణ అసోసియేషన్ కార్యదర్శి భువనేశ్వరి గ్రామస్తులు అభినందించారు. నాలుగు పతకాలు సాధించిన పృథ్వీరాజ్‌ను ఆదివారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాలువాతో సన్మానించారు. వచ్చే నెలలో థాయిలాండ్‌లో జరిగే ఇంటర్ నేషనల్ పోటీలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. జరిగే మ్యాచ్‌కు అన్ని విధాలుగా సహకరిస్తామన్నారు.



కుంగిపోయిన వంతెనకు మరమ్మతులు చేపట్టాలి



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రం నుంచి సొనాలకు వెళ్లే దారిలోని పెద్దవాగు వంతెన కుంగిపోయిందని దానికి మరమ్మతులు చేపట్టాలని సామాజిక కార్యకర్త జక్కుల వెంకటేష్ అన్నారు. సోమవారం కుంగిపోయిన వంతెనను గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. వంతెన ఒక భాగం కుంగిపోయి ప్రమాదకరంగా ఉందన్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలన్నారు. లేకపోతే వర్షం వల్ల అది పూర్తిగా కొట్టుపోయే ప్రమాదముందని అన్నారు. అలా జరిగితే బోథ్ సొనాలకు రాకపోకలు నిలిచిపోయి, పాఠశాల విద్యార్థులకు ఇబ్బందులు ఏర్పాడుతాయని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రైతులు చంద్ర మోహన్‌రెడ్డి, బాబు, డాక్టర్ రాములు, నిమ్మల నర్సయ్య, గంగయ్య, గంగాధర్, లంక రమణ పాల్గొన్నారు.

ఉద్రిక్తత ఘటనలో 20 మందికి రిమాండ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పోలీసుల విధులకు ఆటంకం కలిగించి, పోలీసులపై దాడి చేసిన ఘటనలో 20 మందిని అరెస్టు చేసి జైలుకు పంపినట్టు 1 టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపారు. ఆదివారం పట్టణంలో బీజేపీ నాయకులు ఆందోళన తెలుపగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో ఇరువురికి వాగ్వివాదం చోటుచేసుకోగా తోపులాట జరుగగా ఉద్రిక్తతకు దారితీసింది. ఈ నేపథ్యంలో పోలీసులపై దాడికి పాల్పడుతూ పోలీసుల వాహనాన్ని ధ్వంసం చేశారని, వన్ టౌన్‌లో దాదాపు 37 మంది మీద కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఇందులో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందంతో పాటు 20 మందిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు పేర్కొన్నారు. మిగతా వారి కోసం వెతుకుతున్నట్లు పేర్కొన్నారు.

సాయినగర్ సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీలోని సమస్యలు పరిష్కరించాలని సామాజిక కార్యకర్త వెంకటేష్ సోమవారం జిల్లా కలెక్టర్ రాజర్షిషాకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సాయినగర్ కాలనీలోని అంగన్‌వాడీ భవనం అసంపూర్తి నిర్మాణం ఉందన్నారు. రేషన్ షాప్ ఏర్పాటు చేయాలని కోరారు. మురుగు నీరు నిల్వ ఉండటంతో టైఫాయిడ్, డెంగ్యూ, మలేరియా, వ్యాధుల వచ్చే ప్రమాదం ఉందని విన్నవించారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన వారిలో వెంట ఆరె రమేష్ పాటిల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని కారు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-నేరడిగొండ

గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని బోథ్ ఎక్స్‌రోడ్డు వద్ద సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. పొచ్చెర గ్రామానికి చెందిన నక్క అనంత్, అతని భార్య నిర్మలతో కలిసి పొచ్చెర నుంచి ఇచ్చోడకు బయలుదేరి వెళుతుండగా మార్గమధ్యలో బోథ్ ఎక్స్ రోడ్డు వద్ద గుర్తుతెలియని కారు అతివేగంగా వచ్చి ఢీకొనడంతో నక్క అనంతుకు తీవ్ర గాయాలు కాగా అతని భార్య స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం రిమ్స్ తరలించారు. ఢీకొట్టిన కారును పట్టుకోవాలని వారిపై తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పీరీల ఊరేగింపు

నవతెలంగాణ-నార్నూర్

మొహరం పండుగ సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో పీరీలను ఊరేగించారు. భక్తులు ఇంటింటికి తిరుగుతూ నృత్యాలు చేస్తూ, పూజలు చేసి తమ తమ మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో పెందూర్ దుంది, ముజావర్, లచ్చు, ఇస్రు, బిల్లు, దేవు, నాగోరావ్, లాల్‌శావ్, సచిన్, మాన్కు, ఆనంద్‌రావ్ పాల్గొన్నారు.

జీఓ నెంబర్ 10ని వెంటనే రద్దు చేయాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్
- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద అంగన్‌వాడీల నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అంగన్‌వాడీల శ్రమను అగౌరవ పరిచేలా ఉన్న జీఓ నెంబర్ 10ని వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలు తమ సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. సోమవారం ఎనిమిదవ రోజుకు చేరుకోగా దీక్షలో భాగంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ముందుగా దీక్ష శిబిరం నుంచి క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీగా తరలివెళ్లి బైటాయించి సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ హాయంలో హక్కుల సాధనతో రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కోసం సమ్మె చేశామన్నారు. సమ్మెతో దిగి వచ్చిన ప్రభుత్వం టీచర్లకు రెండు లక్షలు, హెల్పర్లకు లక్ష రూపాయల బెనిఫిట్స్ ఇస్తామని హామీ ఇచ్చిందని, కానీ జీవో విడుదల చేయలేదన్నారు. సమ్మె కాలంలో కాంగ్రెస్ నాయకులు శిబిరాలను సందర్శించి మద్దతు తెలిపి, అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలవుతున్న పట్టించుకోవడం లేదన్నారు. తమ సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. అసెంబ్లీ, పార్లమెంట్‌లో చర్చించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు వెంకటమ్మ, రాష్ట్ర కమిటి సభ్యురాలు సునీత, నాయకురాలు పార్వతి, అనసూయ, పద్మ, విశాఖ, లక్ష్మీ నజీమా పాల్గొన్నారు.

అకౌంట్లపై ఉన్న ఫ్రీజింగ్‌ను ఎత్తివేయాలి

- పోస్ట్ ఆఫీస్ ఎదుట రైతుల నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తమ డబ్బులు తమకు ఇప్పించడంతో పాటు అకౌంట్‌పై ఉన్న ఫ్రీజింగ్‌ను ఎత్తివేయాలని రైతులు ప్రాధేయపడ్డారు. ఈ విషయమై సోమవారం పట్టణంలోని పోస్టాఫీసు ఎదుట నిరసన తెలిపారు. ఆరు నెలల కింద పోస్ట్ పేమేంట్ బ్యాంక్ మేనేజర్ సీసీఐ ద్వారా రైతులకు వచ్చిన పత్తి డబ్బులు కాజేసిన విషయం తెలిసిందే. అయితే సదరు మేనేజర్ రైతుల అకౌంట్‌లలో డబ్బులు వేయడంతో వాటిని పోలీసులు ఫ్రీజ్ చేయించారు. దానిపై ఉన్న ఫ్రీజింగ్ ఎత్తివేయాలని రైతులు కోరారు. ఆదిలాబాద్ రూరల్, తాంసి, జైనథ్ మండలాలకు చెందిన రైతులు అధికారులతో మాట్లాడినంతరం జిల్లా కలెక్టర్ రాజర్షిషాను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా తాంసి మండలం వడూర్‌కు చెందిన రైతు మోహన్ మాట్లాడుతూ ఆరు నెలల క్రితం పోస్ట్ పేమేంట్ బ్యాంక్ మేనేజర్ రైతుల నగదు కాజేశారన్నారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు అతని బ్యాంక్ నుంచి వేరే ఖాతాల్లో డబ్బులు జమ అయిన అకౌంట్లను ఫ్రీజ్ చేశారన్నారు. తమ అకౌంట్లో డబ్బులున్న వ్యవసాయానికి వాడుకోలేక వడ్డీపై డబ్బులు తీసుకొని వ్యవసాయం చేస్తున్నామన్నారు. డీఎస్పీని కలిసి విన్నవించడంతో ఆయన లేటర్ ఇచ్చారన్నారు. కానీ పోస్ట్ ఆఫీసు వారు మాత్రం రేపు మాపు అంటు కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని మండిపడ్డారు. తమ అకౌంట్లపై ఉన్న ఫ్రీజింగ్ ను ఎత్తివేయాలని కోరారు.

పాఠశాలను సందర్శించిన డీఈఓ



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని సుంకిడి ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాలను సోమవారం డీఈఓ ప్రణీత సందర్శించారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల శిథిలావస్థకు చేరుకొని పెచ్చులూడుతున్న తరగతి గదులను పరిశీలించి, వాటిని తక్షణమే రిపేర్లు చేయించాలని ఎంఈఓ నారాయణను చరవాణిలో ఆదేశించారు. మన ఊరు మనబడిలో భాగంగా ప్రాథమిక పాఠశాలలో నిర్మించబడ్డ నాలుగు గదులను వర్షాకాలం పూర్తయ్యేంతవరకు నాలుగు నెలలపాటు ఉన్నత పాఠశాల తరగతుల బోధన కోసం వాడుకోవాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆదేశాల మేరకు తాను పాఠశాలను సందర్శించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఎనిమిది, తొమ్మిది, 10వ తరగతి విద్యార్థులతో తరగతి గదిలోకి వెళ్లి కష్టపడి చదవాలని సూచించారు. ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థులతో గణితం లెక్కలు చేయించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు గజానన్, వై. రామ్‌రెడ్డి, సుకుమార్ పేట్కులే, శ్రీనివాస్‌రెడ్డి, సుజాత, నాందేవ్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేందర్ ఉన్నారు.

ఉపాధ్యాయుల బదిలీలు పాత స్థానాలకే కేటాయించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

ఉపాధ్యాయుల బదిలీలు పాత స్థానాలకే కేటాయించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు నూర్‌సింగ్ అన్నారు. సోమవారం ఐటీడీఏ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా పీఓ ఖుష్బు గుప్తాను కలిసి పుష్ప గుచ్ఛం అందించారు. ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా 317 జీఓ నెంబర్‌లో బదిలీ అయిన వారికి వారి పాత స్థానాన్ని చూపిస్తూ పాయింట్స్ కేటాయించాలని కోరారు. మ్యూచువల్‌లో బదిలీ అయిన ఉపాధ్యాయులకు కూడా బదిలీలో అవకాశం కల్పించాలని, పండిత్ తెలుగు, హిందీ, పీఈటీ పోస్టులను ఉన్నతీకరించాలని పైఅధికారులకు విన్నవించాలని కోరారు. ఆన్‌లైన్ ఆప్షె తేదీని పొడగించాలని కోరారు. పీఓ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు నవీన్ యాదవ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జాదవ్ ప్రకాష్, దినేష్‌బాబు సింగ్, ప్రసాద్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-సిరికొండ



ఇటీవల అనారోగ్యంతో మండల కేంద్రానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ తోకల చిన్నరాజన్న తండ్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట నాయకులు కృష్ణారెడ్డి, పెంటన్న, సూర్యకాంత్, రోహిదాస్, మల్లేష్ పాల్గొన్నారు.

నార్నూర్ : మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలోని విద్యార్థినులు నాలుగు రోజుల కింద శ్వాసకోశ సమస్యతో అస్వస్థతకు గురయ్యారు. ఇద్దరు విద్యార్థినులు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న సందర్భంగా సోమవారం మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్ పరామర్శించారు. ఆరోగ్య విషయాలు తెలుసుకొని త్వరగా కోలుకుని తిరిగి చదువుపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జైసింగ్ రాథోడ్‌తో మాట్లాడి విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

యువత మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు

నవతెలంగాణ-ఖానాపూర్

యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని సీఐ సైదారావు అన్నారు. సోమవారం ఖానాపూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి, తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని అన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేనిదే వాహనాలను నడపరాదని, మైనర్లు డ్రైవింగ్ చేయరాదన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పలు సూచనలు చేశారు. పలు అంశాలపై విద్యార్థులకు అవగాహనను కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై లింబాద్రి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్లు పాల్గొన్నారు.

గుడిహత్నూర్‌లో పర్యటించిన కలెక్టర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గుడిహత్నూర్ మండలంలో కలెక్టర్ రాజర్షిషా పర్యటించారు. సోమవారం మండలంలోని మన గ్రోమోర్ ఫర్టిలైజర్ షాప్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయాన్ని, గోదాంలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్‌లను, నిల్వ ఉన్న బ్యాగ్‌లను క్షుణ్ణంగా పరిశీలించి, రోజువారి అమ్మకాలపై ఆరాతీశారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి ప్రజాపాలన సేవా కేంద్రాన్ని పరిశీలించారు. ప్రజా పాలన సేవా కేంద్రం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని అధికారులు సమయపాలన పాటించాలని అన్నారు. ప్రజాపాలన బ్యానర్ ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు తహసీల్దార్ కవితారెడ్డి, ఎంపీడీఓ, డీఏఓ పుల్లయ్య, డీసీఓ మోహన్‌సింగ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఉట్నూర్

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కె.సునిత అన్నారు. సోమవారం సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు అంగన్‌వాడీ ఉద్యోగులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జీఓ నెంబర్ 10ని రద్దు చేసి, అంగన్‌వాడీలకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, హెల్పర్‌కి రూ.లక్ష చెల్లించి, అంగన్‌వాడీలకు రూ.2లక్షలు చెల్లించాలి కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. అనంతం ఎమ్మెల్యే పీఏ భుజంగ్‌రావుకి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ ధర్నాలో రత్నమాల, వీణ, ముక్త, సుభద్ర అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముదిరాజ్ కులస్తుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-సిరికొండ

ముదిరాజ్ కులస్తుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విజయ్ కుమార్‌ను ఆ సంఘం కులస్తులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో అభయహస్తంలో ముదిరాజ్‌ల అభివృద్ధికి పెద్దపీట వేశారని అన్నారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తి కావడంతో తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ముదిరాజ్‌లను బీసీడీ నుంచి బీసీఏలోకి మార్చాలని, ముదిరాజ్‌లకు ఒక కోఆపరేటివ్ సొసైటీ, ఛైర్మెన్‌ని ఇవ్వాలన్నారు. ఇతర కులాలకు ఇచ్చిన విధంగా పించన్లను, రాజకీయ రంగంలో ముదిరాజ్‌లకు ఒక మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కులస్తులు ఎగ్గిడి మల్లారెడ్డి, పెంటన్న, అమూల్, నర్సింలు, ఇస్తారి, తులసిదాస్, ఆశన్న ప్రవీణ్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగిఉండాలి



నవతెలంగాణ-తలమడుగు

చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని షీటీమ్ సభ్యులు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని భరంపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు షీటీమ్ విధులతో పాటు సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. వసతిగృహంలో చదువుకుంటున్న విద్యార్థులందరికీ ఫోన్‌ను ఎక్కువగా వాడకూడదని, ఫోన్‌లో ఏమైనా మెసేజ్‌లు గాని, ఏదైనా కొత్త యాప్‌లు గాని డౌన్‌లోడ్ చేయకూడదని తెలియజేశారు. మనకు తెలియని యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకొని మన పర్సనల్ డేటా షేర్ చేసి ఇబ్బందులు గురికా వద్దని తెలిపారు. ఫోటోలు మార్ఫింగ్ చేసి, ఆ విధంగా కూడా అమ్మాయిలను మోసం చేసే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఏదైనా మోసాలు ఇలాంటివి జరిగినప్పుడు వెంటనే 1930కి కాల్ చేయాలని, అమ్మాయిలను ఎవరైనా పోకిరీలు వేధించినట్లయితే వెంటపడటం ఇలాంటివి చేసినప్పుడు వెంటనే షీటీమ్ నెంబర్ 8712659953కి కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది. షీటీమ్ సభ్యులు పాల్గొన్నారు.

అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట..



నవతెలంగాణ-లోకేశ్వరం

మండల కేంద్రంలో సోమవారం అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట.. కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు సమతుల్యమైన పౌష్టికాహారం అందిస్తున్నట్టు పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వినయ్‌సాయి, అంగన్‌వాడీ టీచర్లు విజయ, సురేఖ, కల్పన, లత, ముత్యమ్మ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి

నవతెలంగాణ-దస్తురాబాద్

మండలంలోని పోలీస్ స్టేషన్‌లో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా సోమవారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జీ ఎస్సై శంకర్ మాట్లాడుతూ మానవులకు అత్యవసరమైన ప్రాణవాయువు అందించేవి మొక్కలేనని, సరైన వర్షాలు కురవాలన్న మొక్కలను నాటాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు, వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దుర్గం మల్లేష్, రంజిత్, రాజన్న రాజేశం, ఏపీఓ, టీఏ, గ్రామస్తులు పాల్గొన్నారు.

రెండవ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలి

నవతెలంగాణ-రెబ్బెన



ఎన్‌హెచ్ఎం స్కీంలో పని చేస్తున్న రెండవ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. సోమవారం రెబ్బెన పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సుజీత్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌హెచ్ఎంలో పని చేస్తున్న రెండవ ఏఎన్ఎంలను ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలన్నారు. అదే విధంగా పని ఒత్తిడి తగ్గించాలనే డిమాండ్‌తో ఈనెల 18న కమిషనర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రెండవ 2వ ఏఎన్ఎంల సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి ప్రమీల, సునీత, వనిత, విజయ లక్ష్మి, పద్మ తులసి పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



మండలంలోని ఈజ్‌గాం పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో నూతన చట్టాలు, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియమాలు, సైబర్ మోసాలపై విద్యార్థులకు పోలీస్ కళాబృందంతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్సై హీరామన్ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకూడదని, వాహన దారులు మద్యం తాగి డ్రైవింగ్ చేయొద్దని సూచించారు. లైసెన్సు, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు. సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్నందున సైబర్ నేరగాళ్ల మాయమాటలకు లోనుకావద్దన్నారు. ఎవరైన సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 నెంబరు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి



నవతెలంగాణ-వాంకిడి

పర్యావరణ పరిక్షణ కోసం నాటిన మొక్కలను పరిరక్షించాలని ఎస్సై సాగర్, కాంగ్రెస్ నాయకులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అర్జుగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కాంగ్రెస్ యూత్ ఆధ్వర్యంలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటడం ద్వారా వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుందని, మొక్కలను పాఠశాలలతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా నాటాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్సిళ్లు అందజేశారు. మొక్కల ద్వారా కలిగే లాభాల గురించి వివరించారు. భావితరాలకు మనమిచ్చే సంపద ఇదేనని వివరిస్తూ రోజురోజుకు కాలుష్యం పెరగడం వల్ల వాతావరణంలో అనేక మార్పులు జరుగుతున్నాయని, మొక్కలు నాటడమే ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. అనంతరం మొక్కల అవశ్యకత గురించి విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు గుర్నులే నారాయణ, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గం ప్రశాంత్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ దాదాజీ, బొట్టుపెల్లి జయరాం, దీపక్‌ముండె, మండల నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సింగరేణి తీసుకుంటున్న భూమిని రీసర్వే చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రెబ్బెన మండలంలోని గోలేటిలో నూతనంగా ఏర్పాటు చేయనున్న సింగరేణి గనుల కోసం అధికారులు తీసుకుంటున్న 58 ఎకరాల భూమికి సంబంధించిన రీ సర్వే సోషల్ ఆడిట్ నిర్వహించాలని బాధితులు కలెక్టర్ వెంకటేష్ ధోత్రేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి గనులకు భూమి కోసం సర్వే చేసిన అధికారులు నిర్లక్ష్యంతో తప్పులతడకగా చేశారన్నారు. గతంలో రీ సర్వే చేయమని కోరినట్లు తెలిపారు. ఆర్డీఓ కార్యాలయంలో భూముల అవార్డు కోసం జరిగిన సమావేశంలో కొంతమంది సంతకాలు చేశారని, సంతకాలు చేయని రైతులను ప్రస్తుతం సింగరేణి అధికారులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తమ భూములను రీ సర్వే సోషల్ ఆడిట్ చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బాధితులు అశోక్, గౌతమ్, దేవమ్మ లక్ష్మి పాల్గొన్నారు.

ఈజ్‌గాం ఆలయంలో ఆషాడమాస పూజలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న స్వామి దేవాలయంలో సోమవారం ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మెన్ మైలారపు మురళీధర్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి జి. వేణుగోపాల్ గుప్తా, ఆలయ కమిటీ సభ్యురాలు ఎమ్మాజీ సంతోష్ శారధ దంపతులు, వాసవీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు కంబంపాటి సంతోష్, మాజీ చైర్మెన్ ఇందారపు రాజేశ్వర్‌రావు, ప్రశాంత్, శ్రీనివాస్, ఆలయ పూజారి సంతోష్ పాల్గొన్నారు.

మాజీ జడ్పీటీసీకి సన్మానం

నవతెలంగాణ-వాంకిడి



మండలంలో ఐదు సంవత్సరాలుగా జడ్పీటీసీ అజయ్‌కుమార్ పదవికాలం ముగియడంతో సోమవారం బీఆర్ఎస్ నాయకురాలు కొబ్రాగడె గంగుబాయి సత్కరించారు. ఆయనకు శాలువాలు కప్పి ఐదేండ్లలో ఆయన సేవలను కొనియాడారు. భవిష్యత్తులో మరెన్నె పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సదాశివ్ ఉన్నారు.

ఇన్‌స్పైర్ మనక్ అవార్డ్స్‌కు నామినేషన్ల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థుల వినూత్న ఆలోచనలకు వేదిక ఇన్‌స్పైర్ మనక్ అవార్డ్స్‌కు నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి ప్రతి పాఠశాల నుండి ఐదు నామినేషన్లు పంపించాలని, సెప్టెంబర్ 15 వరకు నామినేషన్లు సమర్పించే అవకాశం ఉంటుందన్నారు. ఈ అవార్డు కింద దరఖాస్తు చేసుకున్న పాఠశాలలు, భారత ప్రభుత్వ ఇ-మేనేజ్మెంట్ ఆఫ్ ఇన్‌స్పైర్ అవార్డ్ స్కీమ్ వెబ్ పోర్టల్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఇన్‌స్పైర్‌అవార్డ్స్-డీఎస్‌టీ.జీఓవీ.ఇన్ లింక్ క్లిక్ చేసి ఆన్‌లైన్ ద్వారా నామినేషన్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. సందేహాలు నివృత్తి చేసుకోవడానికి జిల్లా సైన్స్ అధికారి మధుకర్‌ను సంప్రదించాలన్నారు.

18న వాహనాల వేలం పాట

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వివిధ కేసులో ఎక్సైజ్ శాఖలో పట్టుబడ్డ నాలుగు ద్విచక్ర వాహనాలకు ఈనెల 18న వేలంపాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ దీపక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేలం పాటలో పాల్గొనే వారు ముందస్తుగా 50శాతం డిపాజిట్ చెల్లించాలని, ఇతర వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

అసెంబ్లీలో సమస్యలు ప్రస్తావించాలి

- అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి త్రివేణి
- సిర్పూర్ ఎమ్మెల్యే ఇంటి ఎదుట ధర్నా



కాగజ్‌నగర్ : ఎమ్మెల్యే ఇంటి ఎదుట బైటాయించిన అంగన్‌వాడీలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు నేటికీ అమలుకు నోచుకోలేదని, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అసెంబ్లీలో అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు ప్రస్తావించాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి త్రివేణి కోరారు. తమ సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం ఎమ్మెల్యే ఇంటి ఎదుట అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. 2023 సెప్టెంబర్ 11 నుండి అక్టోబర్ 4 వరకు 24 రోజులు రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె చేయడం జరిగిందన్నారు. హెల్పర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ. లక్ష, టీచర్లకు రూ. రెండు లక్షలు, ఆసర పెన్షన్స్ చెల్లిస్తామని హామీ ఇచ్చారన్నారు. 65 సంవత్సరాలలోపు రిటైర్ అయిన అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్‌కు వీఆర్ఎస్ వర్తింపు చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్ర రెండవ పీఆర్సీ ప్రభుత్వ ఉద్యోగులకు ప్రకటించిన ఐదు శాతం ఐఆర్‌ను అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్‌సకు వర్తింపుచేయాలన్నారు. మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంట్రల్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ జీఓ ఇస్తామని, సమ్మె కాలపు వేతనాలు చెల్లిస్తామని, ప్రమాద బీమా రూ.రెండు లక్షలు చెల్లిస్తామని, ఆన్‌లైన్ ఒకే యాప్ ఉండే విధంగా చేస్తామని హామీలిచ్చారన్నారు. అవి అమలయ్యేలా చూడాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే కుటుంబీకుడు పాల్వాయి సుధాకర్ రావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వెలిశాల క్రిష్ణమాచారి, యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు అరుణ, మల్లేశ్వరి, వినోద, కృష్ణవేణి, కుమారి, రజిత, ఉమాదేవి, హేమవతి, రాజమణి, శ్రీలత, అర్చన, మంగళ, జయప్రద, నియోజకవర్గంలోని వివిధ మండలాల నాయకులు సెక్టార్ బాద్యులు ప్రాజెక్ట్ నాయకులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించే వరకు వెనక్కి తగ్గేది లేదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ హెచ్చరించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అంగన్‌వాడీల రిలే నిరాహార దీక్ష తొమ్మిదవ రోజులో భాగంగా జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ నుండి అంగన్‌వాడీలతో కలిసి భారీ ర్యాలీగా వెళ్లి ఎమ్మెల్యే కోవలక్ష్మి ఇంటి వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేకు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యల పరిష్కరించాలని తొమ్మిది రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అంగన్‌వాడీలకు నష్టం కలిగించేల ఉన్న జీఓ నెంబర్ 10 రద్దు చేయాలన్నారు. పౌష్టికాహార లోప నివారణలో అంగన్‌వాడీల పాత్ర ఎంతో ఉందని ఈ విషయాన్ని కూడా ప్రభుత్వం గ్రహించకపోవడం బాధాకరమన్నారు. అంగన్‌వాడీల ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ మొత్తాన్ని టీచర్లకు రూ.రెండు లక్షలు, హెల్పర్లకు రూ.లక్షలకు పెంచాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మడవి గంగామణి, సీఐటీయూ ఉపాధ్యక్షులు శ్రీకాంత్, నాయకులు వనిత, ఉమ, రాజేశ్వరి, జంగు, తార, హిరబాయి, సరోజ, లత పాల్గొన్నారు.



ఆసిఫాబాద్ : ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీలు

అభివృద్ధికి అధికారులు సహకరించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాను అన్ని రంగాలలో ముందుండేలా జిల్లా అభివృద్ధికి అధికారులు సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్‌లతో కలిసి జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాను అన్ని రంగాలలో ముందు ఉంచేలా అధికారులు సమిష్టిగా కృషి చేయాలని, ప్రజల సంక్షేమం దిశగా సమన్వయంతో పనిచేయాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు, డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి విష జ్వరాలు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. వాతావరణ సమతుల్యత లక్ష్యంగా చేపట్టి వన మహోత్సవంలో జిల్లాలోని అన్ని శాఖలకు 53 లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందని, ఈనెల 31 వరకు లక్ష్యాన్ని పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మహిళా శక్తి పథకంతో మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజాపాలన దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలన్నారు. జిల్లాలో రహదారులు భవనాల శాఖ, పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని తెలిపారు. పారిశుధ్య నిర్వహణ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లాలోని అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పూర్వ ప్రాథమిక విద్య అందించాలి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

పూర్వ ప్రాథమిక విద్యను గ్రామాల్లో చిన్నారులకు అందే విధంగా అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలని సీడీపీఓ విజయలక్ష్మీ అన్నారు. మండల కేంద్రంలోని సంజీవనగర్ అంగన్‌వాడీ కేంద్రం నుండి అమ్మమాట అంగన్‌వాడీ బాట అనే కార్యక్రమం ద్వారా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన పూర్తి ప్రాథమిక విద్యను అందించాలని, చిన్నారుల ప్రవేశాలను పెంచేందుకు ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు. కేంద్రాలకు హాజరైన చిన్నారులకు ఆటపాటల ద్వారా చిన్నారులను ఎలా ఆకట్టుకోవాలో అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇచ్చామన్నారు. ఈ నెల 20 వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా, అంగన్‌వాడీ టీచర్లు చంద్రకళ, ఉపాధ్యాయులు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.



పెంచికల్‌పేట్ : ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



వాంకిడి : ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

వాంకిడి : మండల కేంద్రంలో ఐసీడీఎస్ సీడీపీఓ రెబిక ఆధ్వర్యంలో అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 15 నుండి 20వ తేదీ వరకు అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. చిన్న పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించే బాధ్యత అంగన్‌వాడీ టీచర్లపై ఉందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, ఆయాలు పాల్గొన్నారు.

మహిళా శక్తి యూనిట్ల గుర్తింపు వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహిళల అభివృద్ధికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళా శక్తి పథకంలో యూనిట్ల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. సోమవారం మహిళ శక్తి పథకం యూనిట్లను గుర్తించడంపై సెర్ప్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్లు, డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా శక్తి పథకం ద్వారా మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ఆ దిశగా అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లు కృషి చేయాలన్నారు. ప్రతి మండలంలో మహిళా సంఘాలతో సమావేశాలు నిర్వహించి ఔత్సాహిక మహిళా సంఘాలను మహిళా శక్తి పథకం ద్వారా యూనిట్లు ప్రారంభించే విధంగా ప్రోత్సహించాలన్నారు. చేపల పెంపకం, కోళ్ల పెంపకం, డైరీ ఫార్మ్ నిర్వహణ, క్యాంటీన్లు, మీ-సేవ కేంద్రాల నిర్వహణ, చిన్న పరిశ్రమల ఏర్పాటు వంటి 15 రకాల యూనిట్లను గుర్తించి మహిళా సంఘాలు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని, సంఘాలకు స్త్రీ నిధి పథకం ద్వారా రుణాలను అందించి ప్రోత్సహించాలని తెలిపారు. నిబంధనల మేరకు రుణ సదుపాయం కల్పించి అభివృద్ధి చెందేలా సహకరించాలన్నారు. అనంతరం మండలాల వారీగా యూనిట్లపై సమీక్షించారు. కార్యక్రమంలో అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ, స్త్రీ నిధి రీజనల్ మేనేజర్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

బురదమయంగా మారిన రోడ్డు



నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని తమేశా గ్రామానికి వెళ్లే రోడ్డు బురదమయంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు విస్తరంగా కురవడంతో రోడ్డు పూర్తిగా బురదగా మారుతుంది. దీనిపై రాకపోకలు సాగించే ప్రజాలు అవస్థలు పడుతున్నారు. దీనిపై ప్రజా ప్రతినిధులు, అధికారులకు విన్నవించిన పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామ సమస్యలను త్వరగా పరిష్కరించాలని గ్రామస్తుడు సెండె పాలక్‌రావు అన్నారు. చిన్నపాటి వర్షానికే రోడ్డు పూర్తిగా బురదమయంగా మారి రోడ్డు గుండా వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. అధికారులకు, ప్రజా ప్రతినిధులకు అనేకసార్లు వినతిపత్రాలు అందజేసిన ఎవరు పట్టించుకోవడంలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ వర్షాకాలంలోనైనా రోడ్డుకు మరమ్మత్తులు చేయించాలని కోరారు.

దరఖాస్తుల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

వివిధ సమస్యలపై ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందిస్తున్న అర్జీలను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, కాగజ్‌నగర్ ఆర్డీఓ కాసబోయిన సురేష్‌తో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తుల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. మండల స్థాయిలో ఫిర్యాదు పరిష్కారం జరిగితే జిల్లా స్థాయి వరకు రావాల్సిన అవసరం ఉండదని ఆ దిశగా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలన్నారు. దరఖాస్తుదారుడు మళ్లీ అదే దరఖాస్తుపై రాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు సరిహద్దుల గుర్తింపు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ మున్సిపాలిటీగా ఏర్పడి నాలుగు నెలలు పూర్తయినప్పటికీ సరిహద్దుల గుర్తింపు ప్రక్రియ పూర్తికాక పోవడంతో అధికారులు పడుతున్న ఇబ్బందులకు తెరదిగింది. సోమవారం ఎట్టకేలకు ఆసిఫాబాద్ మున్సిపాలిటీ రాజంపేట గ్రామపంచాయతీ సరిహద్దులను మున్సిపల్ కమిషనర్ భుజంగ రావు ఆధ్వర్యంలో గుర్తించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రాజంపేట గ్రామపంచాయతీ పరిధిలో అటవీశాఖ చెక్‌పోస్ట్ వెనకనుంచి పద్మశాలి భవన్, ఎస్ఎం గార్డెన్ నుంచి టీఆర్ నగర్ వరకు, హోలీ ట్రినిటీ నుంచి వాసవి భవన్ వరకు, ఆర్టీసీ పెట్రోల్ బంక్ నుంచి ఆంజనేయులు సామిల్ వరకు, ఎస్పీ క్యాంప్ ఆఫీస్ నుంచి జూబ్లీ మార్కెట్ వరకు, జూబ్లీ మార్కెట్ నుంచి సత్యసాయి టెంపుల్ వరకు రాజంపేట గ్రామపంచాయతీ సరిహద్దులను గుర్తించారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి యశ్వంత్, రిటైర్డ్ ఎంసీ నరేందర్ గౌడ్, మున్సిపల్ సిబ్బంది సంతోష్, వంశీ పాల్గొన్నారు.

విచారణ ఖైదీల పట్ల సరిగ్గా వ్యవహరించాలి

- సీనియర్ సివిల్ జడ్జి యువరాజ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విచారణ ఎదుర్కొనే ఖైదీల పట్ల సరిగ్గా వ్యవహరించి సరైన విచారణ జరిపేలా చూడాలని సీనియర్ సివిల్ జడ్జి యువరాజ అన్నారు. తన కార్యాలయంలో విచారణ ఎదుర్కొనే ఖైదీలకు సంబంధించి అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైలు జీవితం అనుభవిస్తున్న ఖైదీలు విచారణ ఎదుర్కొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఖైదీలు విచారణ అనంతరం బయటికి వెళ్లే పరిస్థితి ఉంటే వారికి సమాజంలో పరిస్థితులపై అవగాహన కల్పించాలన్నారు. మళ్లీ అటువంటి నేరం జరగకుండా చూడాలని సూచించారు. జైలులో సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను విచారణకు హాజరయ్యేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సబ్ జైలర్ ప్రేమ్ కుమార్, డీసీఆర్‌బీ సీఐ రమేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

నవతెలంగాణ-జన్నారం



రోడ్డు ప్రమాదాల నివారణకు అందరూ కృషి చేయాలని ఎస్ఐ సర్కార్ కోరారు. సోమవారం పొనకల్‌లోని ధర్మారం చౌరస్తా వద్ద ప్రజలకు, ఆటో డ్రైవర్లకు ఆయన రోడ్డు నియమాలపై అవగాహన కల్పించారు. వాహనదారులు పరిమిత వేగంతో నడపాలన్నారు. అతి వేగంగా వెళ్లి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని సూచించారు. అలాగే ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్ కాగితాలను తప్పకుండా వెంట ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

నవతెలంగాణ-జన్నారం



ప్రతి ఒకరు ఒక మొక్కను నాటి వాటిని పూర్తిస్థాయిలో సంరక్షించాలని మండలంలోని ఇంధన్‌పెల్లి జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి రాజేందర్ అన్నారు. సోమవారం ఆ పాఠశాలలో విద్యార్థుల చేత ఒక్కొక్క మొక్కను నాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు తమ తమ ఇండ్ల వద్ద ఖాళీ స్థలాల్లో ఒక్కొక్క మొక్కను నాటి వాటిని పూర్తిస్థాయిలో సంరక్షించి వృక్షాలుగా తయారు, చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

కంటి చూపు పట్ల నిర్లక్ష్యం వద్దు

● ఎంపీడీఓ సత్యనారాయణ



నవతెలంగాణ-జైపూర్

ఏ వయస్సులో ఉన్న వారైనా సరే కంటి చూపు సమస్య వస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్య సేవలు పొందాలని స్థానిక ఎంపీడీఓ గుర్రం సత్యనారాయణ అన్నారు. మంచిర్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో వైద్యులతో కలిసి ఆయన పాల్గొన్నాడు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఐదు రోజుల క్రితం నుంచి మండల పరిధిలో ఉచిత నేత్ర చికిత్స శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు గత ఐదు రోజులుగా మండల పరిదిలో ప్రచారం చేసినట్లు తెలిపారు. ఈ శిబిరంలో 150 మంది కంటి సమస్యలు ఉన్న వారు ఉచిత నేత్ర చికిత్స శిబిరంలో పాల్గొన్నట్లు తెలిపారు. లయన్స్ క్లబ్ మంచిర్యాల గోల్డెన్ జూబ్లీ, లయన్స్ క్లబ్ విజయ్‌కేర్ బెల్లంపల్లి, లయన్స్ ఐ ఆసుపత్రి రేకుర్తి వారి ఆధ్వర్యంలో కంటి వైద్యులు రోగులను పరిక్షించారు. 50 మందికి శస్త్ర చికిత్స అవసరమవుతుండగా వారిని ఆసుపత్రికి తరలించి శస్త్ర చికిత్సల అనంతరం తిరిగి మండల కేంద్రానికి చేర్చనున్నట్లు తెలిపారు. ఉచిత నేత్ర చికిత్స శిభిరంలో లయన్ డాక్టర్ సుగుణాకర్‌రెడ్డి, లయన్ వెంకటేశ్వర్లు, పుల్లూరి బాలమోహన్, డాక్టర్ రాకేష్ రెడ్డి, లయన్ సయ్యద ఇలియాజ్, వాలేటి శ్రీనివాస్ స్థానిక తాజా మాజీ ఎంపీటీసీ లింగస్వామి, గ్రామ పంచాయతి కార్యదర్శి ఉదయ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి



నవతెలంగాణ-జన్నారం

సమస్యలను పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఎంపీడీఓ శశికళ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఆ దరఖాస్తులను సంబంధిత అధికారులకు పంపించి త్వరగా పరిష్కరించాలని అదేశించారు. మండల కేంద్రంలో పరిష్కారమయ్యే సమస్యలను ఇక్కడే పరిష్కరించి, పరిష్కారం కాని వాటిని కలెక్టరేట్‌కు పంపిస్తున్నామన్నారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డీ రమేశ్, ఏఓ సంగీత పాల్గొన్నారు.

జాతీయ ఉపకార వేతనానికి 16 మంది విద్యార్థినుల ఎంపిక



నవతెలంగాణ-మందమర్రి

ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు కేంద్ర విద్యాశాఖ అందించే జాతీయ ఉపకార వేతనానికి మందమర్రి మోడల్ స్కూల్ విద్యార్థినులు 16మంది ఎంపికయ్యారు. ఎంపీసీ నుండి ఎల్ అభినయ, జి అక్షిత, కె కీర్తన, ఏ నక్షిత, ఏ సాయి ప్రసన్న, కె సమత, కె శివాని, ఈ స్నేహిత, ఈ స్ఫూర్తి ప్రియ, ఆర్ వర్షిత, బైపీసీ నుండి సిహెచ్ స్పందన, పి శరణ్య, కె వైష్ణవి, బి సాయి వైష్ణవి, సిఈసి నుండి బి సంకీర్తన, జె రమాదేవి ఎంపికయ్యారు. జాతీయ ఉపకార వేతనం కింద గ్రాడ్యుయేషన్‌లో సంవత్సరానికి రూ.10,000 చొప్పున రూ.30,000, పోస్ట్ గ్రాడ్యుయేషన్ నందు సంవత్సరానికి రూ.20,000 చొప్పున రూ.40,000 మొత్తం రూ.70,000 కేంద్ర ప్రభుత్వం ద్వారా ఉపకార వేతనం 16మంది విద్యార్థులకు అందనుంది. కష్టపడి చదివి ఉపకార వేతనానికి ఎంపికైన విద్యార్థులకు ఆ స్థాయిలో బోధించిన పాధ్యాయ బృందానికి ప్రిన్సిపాల్ జయకృష్ణరెడ్డి అభినందనలు తెలిపారు.

ఘనంగా మల్లన్న కళ్యానోత్సవం

నవతెలంగాణ-జైపూర్

భారీగా తరలివచ్చిన భక్తుల మధ్య వేలాల మల్లిఖార్జునస్వామి కళ్యానోత్సవం సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఆలయ ప్రాంగణంలో పెద్దపట్నం వేసిన ఒగ్గు పూజారులు సాంప్రదాయ బద్దంగా ఖేతమ్మ, భ్రమరాంభికా సమేత మల్లిఖార్జున స్వామికి కళ్యాణం జరిపించారు. తొలి ఏకాదశి పండుగకు ముందు మల్లిఖార్జున స్వామి కళ్యానోత్సవం జరిపించడం గ్రామస్థులు ఆనవాయితిగా వస్తోంది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అగ్ని గుండాలను శివసత్తుల కోలాహలం మధ్య అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. దేవాదాయ శాఖ ఈఓ రమేష్ ఆధ్వర్యంలో యాదవ కుటుంబాల వారు ఒగ్గు పూజారులతో నిర్వహించిన కళ్యానోత్సవంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, స్థానిక ఎస్ఐ శ్రీధర్ పాల్గొన్నారు.



అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

నవతెలంగాణ-మంచిర్యాల

ఎన్నికల ముందు అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మరిచిందని, జీఓ 10ని రద్దు చేసి, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్లను పెంచుతూ వీఆర్ఎస్ సౌకర్యం కల్పించి కొత్త జీఓ తేవాలని కోరుతూ సోమవారం మంచిర్యాలలో గల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్, ఇంటి ముట్టడించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తెలంగాణ టీచర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం జిల్లాకు చెందిన ముగ్గురు ఎమ్మెల్యేల ఇంటి ముందు నిరసన తెలిపారు. సంబంధిత అధికారులకు వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ హెల్పర్లకు పాత పద్ధతిలోనే ప్రమోషన్ ఇవ్వాలని, 24 రోజుల సమ్మె సందర్భంగా అంగన్వాడీ టీచర్స్, హెల్పర్లకు గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో పెట్టిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. హెల్పర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్, అంగన్‌వాడీ టీచర్లకు రూ.2లక్షలు, హెల్పర్లకు రూ.1 లక్ష ఆసరా పెన్షన్, 65 సంవత్సరాలలోపు రిటైరైన టీచర్స్, హెల్పర్స్కు వీఆర్ఎస్ వర్తింప జేస్తామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర 2వ పీఆర్సీలో ప్రభుత్వోద్యోగులకు ప్రకటించిన 5 శాతం ఐఆర్‌ను వర్తింపజేస్తామని, మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా అప్గ్రేడ్ చేస్తూ జి.ఓ ఇస్తామని, సమ్మెకాలపు వేతనాలు చెల్లిస్తామని, ప్రమాద బీమా 2 లక్షలు చెల్లిస్తామని, టిఎ, డిఎలు, మే నెల సెలవులు, ఆన్‌లైన్ ఒకే యాప్ ఉండే విధంగా చూడాలని కోరారు. అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ కు నష్టం కల్గించే పాత జీఓ నెం. 10ని రద్దు చేయాలనీ అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్ యూనియన్(సిఐటియు) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు భానుమతి, రాజమణి, విరోనిక, సబిత, అనురాధ, రాజేశ్వరి, శారదా, సత్యవతి, భాగ్య, ప్రవీణ, పద్మావతి, సరిత, లక్ష్మి, మహేశ్వరీ, స్వాతి, లావణ్య పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ఇంటిని ముట్టడించిన అంగన్‌వాడీలు

నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం

● మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-నస్పూర్



ప్రభుత్వం చేపట్టిన ఇంటింటా ఇన్నోవేటర్-2024 కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల నుండి ప్రజా ఉపయోగకరమైన ఆవిష్కరణలను ప్రోత్సహించడం జరుగుతుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) సబావత్ మోతిలాల్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య, సైన్స్ అధికారి మధుబాబు, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులతో కలిసి 6వ ఎడిషన్- ఇంటింటా ఇన్నోవేటర్-2024 పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అద్భుతమైన ఆలోచనలు, ప్రాజెక్టులు రూపొందించిన అన్ని వర్గాల ఆవిష్కర్తల నుంచి ఆవిష్కరణలను స్వీకరించడం జరుగుతుందని, గొప్ప ఆవిష్కరణలను ఎంపిక చేసి ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా సంబంధిత ఆవిష్కర్తలకు అవార్డు ప్రధానం చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం జిల్లాకు ఒకరు చొప్పున యువ నిపుణులతో కూడిన ప్రత్యేక బృందాన్ని నియమించి ఇన్నోవేషన్ మిత్రలుగా, 3 నెలల కాలానికి సమన్వయకర్తలుగా పనిచేసి జిల్లా అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాజ సంస్థలు, గ్రామీణ ప్రజలతో సహా విభిన్న వాటాదారులతో నిమగ్నమై మారుమూల గ్రామాలకు కూడా ఆవిష్కరణ ప్రాముఖ్యతను తెలియజేస్తూ నూతన ఆవిష్కరణలను తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తారని తెలిపారు. ఆవిష్కర్తలు దరఖాస్తులను నేరుగా వాట్సాప్ ద్వారా 9100678543 పంపించవచ్చని, దరఖాస్తులో ఆవిష్కర్త పేరు, వయసు, ఫోటో, వత్తి, చిరునామా, ఆవిష్కరణ పేరు, 100 పదాలతో ఆవిష్కరణ వివరణ, ఆవిష్కరణ సంబంధిత హై రిజల్యూషన్ కలిగిన 4 ఫోటోలు, ఆవిష్కరణ విధులను ప్రదర్శించే 2 వీడియోలు ఆగస్టు 3 తేదీలోగా పంపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

పర్యావరణ పరిరక్షణ, వాతావరణ సమతుల్యతను కాపాడటం ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) సబావత్ మోతిలాల్, సింగరేణి సంస్థ శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, విద్యార్థిని, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీవరాశి మనుగడ, పర్యావరణ పరిరక్షణ, వాతావరణ సమతుల్యతను కాపాడటంలలో మొక్కలు ప్రధాన పాత్ర పోషిస్తాయని, భావితరాలకు కాలుష్యం లేని స్వచ్ఛమైన సహజ వాయువు అందించాలని అన్నారు.

న్యాయం చేయాలని ఆడపడుచు ఇంటి ఎదుట ఆందోళన

నవతెలంగాణ-దండేపల్లి

అత్తింటి వారు వేధింపులకు గురి చేస్తూ తన భర్తను తనను విడదీస్తున్నారని ఓ యువతి సోమవారం మండల కేంద్రంలోని తన ఆడపడుచు ఇంటి ఎదుట న్యాయం చేయాలని ఆందోళనకు దిగింది. వివరాల్లోకి వెళితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం కైకారం గ్రామానికి చెందిన సౌజన్య, కొండాపూర్ గ్రామానికి చెందిన ఇప్ప ప్రవీణ్ కుమార్‌తో 2013లో ప్రేమ పెళ్లి జరిగింది. వీరు ఇరువురికి ఒక బాబు ఉన్నాడు. పెండ్లయ్యాక ఏడాది నుంచి అత్తింటి వారు వేధింపులు గురి చేస్తున్నారని ముఖ్యంగా తన ఆడపడుచు తన భర్తకు వేరే పెండ్లి చేసి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని సౌజన్య తన గోడు వెళ్లబోసుకుంది. పోలీసు వారికి సైతం ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేసింది. చేసేది ఏమీ లేక తనకు న్యాయం చేయాలంటూ ఆడపడుచు ఇంటి ముందట నిరసనకు దిగాల్సి వచ్చిందని తనకు న్యాయం చేయకుంటే తన కొడుకుకు తనకు చావే శరణ్యమని పోరాటం చేస్తానని ఆవేదన వ్యక్తం చేసింది. కాగా ఈ విషయమై దండేపల్లి ఎస్ఐ ఉదయ్ కిరణ్ వివరణ కోరగా ఇట్టి కేసుపై 2023 సెప్టెంబర్ లో చేబ్రోలు పోలీస్‌స్టేషన్‌లో వరకట్నపు, గృహహింస వేధింపుల కేసు వారి కుటుంబ సభ్యులపై నమోదు అయిందని బాధితురాలు మెయింటెనెన్స్ కేసు సైతం వేశారని బాధితురాలి ఫిర్యాదు మేరకు ప్రవీణ్ కుమార్ కుటుంబ సభ్యులతో సైతం మాట్లాడడం జరిగిందని తెలిపారు. ఒకే విషయంపై రెండు చోట్ల కేసులు నమోదు చేయలేమని బాధితురాలికి న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



5న మహాసభలను విజయవంతం చేయండి

నవతెలంగాణ-నస్పూర్

తెలంగాణ ప్రగతిశీల ఆటో అండ్ మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ 5వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి(ఐఎఫ్‌టీయూ) డి బ్రహ్మానందం కోరారు. ఈ మహాసభల పోస్టర్లను సోమవారం సిసిసి కార్నర్‌లో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జులై 5వ తేదీన ఇల్లందు పట్టణంలో మహాసభలను నిర్వహించడం జరుగుతుందన్నారు. గత మహాసభల నుంచి నేటి వరకు కొనసాగిన కార్యక్రమాలను సమీక్షించుకొని భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించుకోవడానికి ఈ మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా రవాణా రంగంలో పనిచేస్తున్న కార్మికులు 25 లక్షల పైగానే ఉంటారని, వీరంతా లారీ, డీసీఎం, క్యాబ్, తుఫాన్, జీపు, కారు గూడ్స్ ట్రాన్స్ పోర్ట్, ఆయిల్ టాకర్ అంబులెన్స్ ఆటో డ్రైవర్, ట్రాక్టర్ డ్రైవర్, వాల్వో డ్రైవర్స్, తదితర కేటగిరీలో కార్మికులుగా కొనసాగుతున్నారన్నారు. మోటార్ కార్మికుల పట్ల మోడీ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం సదానందం, శ్రీనివాస్, సమ్మయ్య, పెద్దాపురం శ్రీనివాస్, మధు, రవి, మహేష్, సమ్మయ్య, థామస్ పాల్గొన్నారు.



అందుబాటులో గడ్డి, జొన్న విత్తనాలు

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలో పశు వైద్యశాలలో గడ్డి జొన్న విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పశు వైద్యాధికారి కుర్మ తిరుపతి తెలిపారు. గడ్డి జొన్న విత్తనాలు (సీఎస్‌హెచ్ 24 ఎంఎఫ్) రకం అందుబాటులో ఉన్నాయని, రైతులందరూ విత్తనాలు తీసుకొని పశు గ్రాసం పెంచుకోవాలని, ఈ పశు గ్రాసం మూడు సార్లు కోసుకొని పశువులకు అందించవచ్చని వివరించారు.

రైతులు దరఖాస్తులు చేసుకోవాలి

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని గొల్ల కుర్మ యాదవ రైతులు డీడీ డబ్బును వాపస్ తీసుకునేందుకు దరఖాస్తులు చేసుకోవాలని మండల పశు వైద్యాధికారి కుర్మ తిరుపతి తెలిపారు. గొర్రెల యూనిట్ కొరకు డీడీలు కట్టిన గొల్ల కురుమ యాదవ రైతులు డబ్బులు వాపస్ తీసుకునేందుకు కాసిపేట పశు వైద్యశాలలో దరఖాస్తు చేసుకొనవచ్చని వివరించారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన



నవతెలంగాణ-హాజీపూర్

మండల కేంద్రంలో గల శ్రీనివాస గార్డెన్‌లో హాజీపూర్ ఎఫ్‌పీసీ ఆధ్వర్యంలో సోమవారం సేంద్రియ వ్యవసాయం మీద అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మురళీధర గోధామ వ్యవస్థాపకులు డాక్టర్ చెన్నమనేని పద్మ పాల్గొని సేంద్రియ వ్యవసాయం మీద రైతులకు అవగాహన కల్పించారు. అ నాబార్డ్ డీడీ ఎం అబ్దుల్ రావూఫ్ పాల్గొని హాజీపూర్ ఎఫ్‌పీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవలను కొనియాడారు. సేంద్రియపద్ధతుల్లో చేసే వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్ సదుపాయం కల్పిస్తామని పేర్కొన్నారు. ఎఫ్‌పీసీ సలహాదారు శ్యామ్ సుందర్ రావు మాట్లాడుతూ రైతులందరూ తమ సొంత అవసరాల నిమిత్తం 10 గుంటల వరి, 1 గుంటలో కూరగాయలు, ఆకుకూరలు పండించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌పీసీ చైర్మన్ వినయ్ ప్రకాష్ రావు, డైరెక్టర్స్ శ్రీనివాస రావు, బొడ్డు శంకర్, బోలిశెట్టి తిరుపతి, శ్రీనివాస్, ఇతర రైతులు పాల్గొన్నారు.

చెట్లు నాటే కార్యక్రమం పండగల నిర్వహించాలి



నవతెలంగాణ-తాండూర్

పోచమ్మ బోనాలు, తోవముక్కులు మాదిరిగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని గ్రామాలలో పండగల జరుపుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. సోమవారం మండలంలోని రాజీవ్ నగర్ పంచాయతీలో సెక్రెటరీ కల్పన ఏర్పాటు చేసిన వనమహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణవాయువును, నీడను, ఫలాలనిచ్చే చెట్లు ప్రగతికి సోపానాలని తెలిపారు. నీరు లేని ఏరు, చెట్లు లేని ఊరు ,బోసిపోయినట్లు కనిపిస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనాలన్నారు. వృద్ధులు యువకులు పిల్లలు తమ గుర్తింపుగా మొక్కలు నాటి సంరక్షించుకోవాలని తెలిపారు. రైతులు పొలం గట్లపై ఇంటి పెరటిలో ఫల సాయాన్నిచ్చే మొక్కలను నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సూరం రవీందర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు గట్టు మురళీధర్ రావు ఎన్ఆర్‌ఈజీఎస్ ఏపీ ఓ నందకుమార్ ఈసీ రమేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్మికులను నట్టేట ముంచిన గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు

నవతెలంగాణ-నస్పూర్

గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు, యాజమాన్యం కార్మికులను నట్టేట ముంచాయని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) ఏరియా అధ్యక్షుడు గుల్ల బాలాజీ, కార్యదర్శి అంబాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీరాంపూర్ లోని ఆర్కే-7 గని ఉత్పత్తిని ఆపి కొందరి కార్మికులను బదిలీ చేసే ప్రక్రియ మొదలు పెట్టడం ద్వారా కార్మికుల్లో ఆందోళన మొదలైందని ఆరోపించారు. ఇది ముమ్మాటికి గుర్తింపు పత్రం తీసుకోకుండా ఉన్న గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలుగా చెప్పుకుంటున్న సంఘాల వైఫల్యం అని అన్నారు.

సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం

నవతెలంగాణ-జైపూర్

తాగు నీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ భీమారం గ్రామ పంచాయతీ మహిళలు స్థానిక ఎంపీడీఓ రాధరాథోడ్‌ను కలిసి వినతీ పత్రం అందజేశారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా అందిన ధరఖాస్తులను మండల ప్రత్యేక అధికారి చిన్నయ్యతో కలిసి పరిశీలించారు. రోడ్డు మీదుగా మురికి నీరు ప్రవహిస్తున్నట్లు అందిన పిర్యాదుతో పాటు ఇతరుల నుండి అందిన పిర్యాదుల పట్ల స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శ్రీపతి బాపు, ఈజీఎస్ ఏపీఓ జీనత్, కార్యాలయం పర్యవేక్షకులు విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐదు సంవత్సరాల్లోపు పిల్లలను అంగన్వాడీ కేంద్రంలో చేర్పించాలి

రెండున్నర సంవత్సరాల నుండి ఐదు సంవత్సరాల వయస్సు గల పిల్లలను అంగన్‌వాడి కేంద్రాల్లో చేర్పించాలని మండల ప్రత్యేక అధికారి చిన్నయ్య, ఎంపీడీఓ రాధరాథోడ్ సూచించారు. అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమం ద్వార సోమవారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల కిషోర బాలికలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఎంపీఓ శ్రీపతి బాపు పాల్గొన్నారు.

నవతెలంగాణ
ఆదిలాబాద్
మంగళవారం | జులై 16, 2024 | www.navatelangana.com

ఎమ్మెల్యేని కలిసిన అంగన్‌వాడీలు

నవతెలంగాణ-నేరడిగొండ



మండల కేంద్రంలోని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ హెల్పర్స్ సభ్యులు సోమవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్‌ని మర్యాద కలిశారు. జీఓ నం.10ని రద్దు చేసి రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ పెంచుతూ వీఆర్ఎస్ సౌకర్యం కల్పిస్తూ కొత్త జీఓ ఇవ్వాలని, ఈ సమస్యను అసెంబ్లీ సమావేశాల ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. తొమ్మిది రోజులుగా దీక్షలు కొనసాగుతున్న ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాధవ్ మాట్లాడుతూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని భరోసా ఇచ్చారు.

గ్రామంలో నీటి సమస్యను పట్టించుకోరా..?

- దివ్య శ్రీ ఫౌండేషన్ చైర్మన్ ప్రవీణ్ నాయక్

నవతెలంగాణ-నార్నూర్

మలంగి తండా గ్రామంలో నీటి సమస్య ఉన్న అధికారులు పట్టించుకోవడం లేదని దివ్యశ్రీ ఫౌండేషన్ చైర్మన్, గ్రామ పెద్ద ప్రవీణ్ నాయక్ ఆరోపించారు. సోమవారం గ్రామంలో నీటి ట్యాంక్‌ను పరిశీలించి తండా వాసులు నీరు రాకతో ఇబ్బంది పడుతున్న అధికారులు సమస్యను ఎందుకు పరిష్కరించడం లేదని వాపోయారు. మురుగు నీటితో పాటు చెత్త చెదారంతో గ్రామ ప్రజలు అనేక రకాల సమస్యలకు గురవుతున్నారన్నారు. నెల రోజుల ముందు మండల ప్రత్యేక అధికారులకు సమస్యలు విన్నవించడం జరిగిందన్నారు. వ్యాధులు ప్రబలకుండ ముందస్తుగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు లేవన్నారు. వర్ష కాల నేపథ్యంలో గ్రామంలో క్లోరినేషన్ చేయించాలని కోరారు. ఆయన వెంట గ్రామ పెద్దలు గణేష్ నాయక్, నీలేష్ ఉన్నారు.

మద్రాస్ ఐఐటీకి ఆదర్శ పాఠశాల విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ-బోథ్



మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల నుంచి ఇంటర్ విద్యార్థి సాయి వంశీ మద్రాస్ ఐఐటీకి ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ ఉమేష్ తెలిపారు. 6వ తరగతి నుండి 12వ తరగతి వరకు ఆదర్శ పాఠశాల బోథ్‌లో చదువుకొని ఇంటర్మీడియట్ 2023 బ్యాచ్‌కి చెందిన ఈ విద్యార్థి ఐఐటీ మద్రాస్ యూనివర్సిటీలో డాటా సైన్స్ విభాగంలో సీటు సంపాదించడంపై ప్రిన్సిపల్, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని అభినందించారు.

భక్తి శ్రద్ధలతో మొహర్రం 7వ రోజు పండుగ వేడుకలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కులమతాలకతీతంగా జరుపుకునే మొహర్రం పండుగ వేడుకలు భక్తి శ్రద్ధలతో ప్రారంభమై ఏడవ రోజు పండుగ ఉత్సవాలు ఘనంగా సాగాయి. ఆదివారం రాత్రి జిల్లా కేంద్రంలోని జనకపుర్‌లో మొహర్రం ఏడవ రోజు పండుగ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మల్లిధ మొక్కులతో, బెల్లం షర్బత్, ప్రత్యేక వంటకాలతో డప్పుచప్పుళ్ళ మధ్య వేలాది మంది భక్తులు పీరీలకు మొక్కులు సమర్పించారు. అనంతరం పీరీల మందిరం నుంచి పీరీలను వేలాది మంది భక్తులతో నృత్యాలు చేస్తూ ఉత్సవాలు జరుపుతూ పిరిలను ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు హసీన్, సుధాకర్, నారాయణ, బాబా, రఫిక్, రాకేష్, నజీర్, భక్తులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ రూరల్ : మండలంలోని బారెగూడ గ్రామంలో సోమవారం పీరీల పండుగను భక్తులు ఘనంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాలతో గ్రామ వీధుల గుండా పీరీలను ఊరేగించారు. ఈ సందర్భంగా ఇంటింటా వెళ్లిన పీరీలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పీరీల ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం గ్రామంలో పెద్ద సరిగత్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామస్తులు మల్లేష్, నందయ్య, మెంగాజీ, దేవర వినోద్ పాల్గొన్నారు.

ఎస్ఐని సన్మానించిన వీడీసీ సభ్యులు



నవతెలంగాణ-లోకేశ్వరం

లోకేశ్వరం నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన సక్రియా నాయక్‌ను వీడీసీ సభ్యులు సత్కరించారు. సోమవారం ఎస్ఐని మర్యాదపూర్వకంగా కమిటీ సభ్యులు శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు మండల నాయకులు, ప్రజలు సహకరించాలని ఎస్ఐ కోరారు. ఇందులో చైర్మెన్ అంబకంటి శ్రీనివాస్, క్యాషియర్ విఠల్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీ సెలక్షన్ ప్రక్రియ ప్రారంభం



నవతెలంగాణ-బోథ్

మండలంలోని సొనాల జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో సోమవారం 29 ఎన్‌సీసీ సీట్లకు విద్యార్థులకు ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. 13 మంది బాలికలు, 16 మంది బాలురులను ఎంపిక చేశామని ఎంపిక ప్రక్రియ పాఠశాల అసోసియేట్ అధికారి అన్వర్ అలీ తెలిపారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు ఆంజనేయులు, ప్రధానోపాధ్యాయులు సచిన్, ఉపాధ్యాయులు మధుసుధన్, రమేష్ పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

నవతెలంగాణ-నార్నూర్

సీజనల్ వ్యాధుల పట్ల గ్రామాల్లో ముందస్తుగా వైద్య సిబ్బంది వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. సోమవారం గాదిగూడ మండలంలోని కొలమా గ్రామపంచాయతీ పరిధిలోని తోయిగూడ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి రక్త పరీక్షలు చేశారు. జ్వరం జలుబు దగ్గు ఉన్న వారిని గుర్తించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఈఓ పవార్ రవీందర్ పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వైద్య శిబిరంలో మాజీ ఎంపీపీ రాథోడ్ గోవింద్ నాయక్, వైద్య సిబ్బంది బాపూరావ్, సురేష్, ఆశా అనసుయ బాయి ఉన్నారు.

బస్సు సౌకర్యాలను సద్వినియోగం చేసుకోండి

నవతెలంగాణ-ఉట్నూర్

లక్షెటిపెట్, కరీంనగర్ మీదుగా సూపర్ లగ్జరీ బస్సు సౌకర్యాలను మంగళవారం నుంచి ఏర్పాటు చేయనున్నట్టు డీఎం కల్పన తెలిపారు. ఉదయం ఆరు గంటలు, 11.30కు బస్సు బయల్దేరుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, అందరం సమిష్టిగా ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం సిర్పూర్ పేపర్ మిల్లు లిమిటెడ్-కాగజ్‌నగర్ ఆధ్వర్యంలో కళాకారులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, కాగజ్‌నగర్ ఆర్డీఓ కాసబోయిన సురేష్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నిషేధిత ప్లాస్టిక్ వాడకాన్ని అందరూ సమిష్టిగా నిరోధించాలని, ప్లాస్టిక్ వినియోగం నివారణకు ప్రజలందరూ స్వచ్ఛందంగా కృషి చేయాలన్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల భావితరాలకు జరిగే నష్టాన్ని ప్రజలకు అవగాహన కార్యక్రమాల ద్వారా వివరించి చైతన్యం చేయాలన్నారు. ప్లాస్టిక్ కవర్లు, ఇతర వ్యర్థాలను బయట పడవేయడం వల్ల వాటిని పశువులు తిని మరణించే అవకాశం ఉందని, ప్లాస్టిక్ వ్యర్థాలను పారిశుధ్య నిర్వహణలో భాగంగా చెత్త సేకరణకు వచ్చే వారికి అందించాలని తెలిపారు. జీవరాశికి సహజ వాయువును అందించి, వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ వన మహోత్సవం కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొని మొక్కలు నాటి సంరక్షించేందుకు తమ వంతు బాధ్యతగా కృషి చేయాలన్నారు. అనంతరం



స్వచ్ఛతపై అధికారులు, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిర్పూర్ కాగితపు పరిశ్రమ ప్రతినిధులు రీనాజార్జ్, అశోక్, కళాకారులు, ప్రజలు పాల్గొన్నారు.

వేతనాలు సక్రమంగా చెల్లించని అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీని రద్దు చేయాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్



నవతెలంగాణ-నస్పూర్

వేతనాలు సక్రమంగా చెల్లించని అవుట్సోర్సింగ్ ఏజెన్సీలను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ అన్నారు. తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో కాంట్రాక్టు లవుట్‌సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా 16 మంది సెకండ్ ఏఎన్ఎంలు జిల్లాలోని వివిధ పీహెచ్‌సీలలో విధులు నిర్వహిస్తున్నారన్నారు. 2021 సంవత్సరం నుండి విధుల్లో చేరిన తర్వాత ఇప్పటివరకు సదరు ఏజెన్సీ కాంట్రాక్టర్ ప్రతి నెల వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించే దాంట్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని, జీఓ ప్రకారం చెల్లించడంలేదని గతంలో ఎన్నిసార్లు ఏజెన్సీ నిర్వాహకుని చెప్పిన మా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఇంకా బకాయి వేతనాలు అడిగితే మమ్మల్ని బెదిరిస్తున్నాడని, కావున జీఓ ప్రకారం వేతనాలు పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా చెల్లించని ఏజెన్సీని వెంటనే రద్దుచేసి నేరుగా ఎన్‌హెచ్ఎం ద్వారా వేతనాలు చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి శ్రీలత, రాజ్యలక్ష్మి, ప్రవీణ, సంధ్య, స్రవంతి, ప్రియాంక పాల్గొన్నారు.

డీఈఓపై చర్యలు తీసుకోవాలి : డీటీఎఫ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

క్రీడా పాఠశాల ఉపాధ్యాయుల నియామకాల్లో అక్రమాలకు పాల్పడిన డీఈఓపై చర్యలు తీసుకోవాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని క్రీడా పాఠశాలలో ఉపాధ్యాయుల డిప్యూటేషన్ నియమకాలలో పారదర్శకత పాటించలేదని ఆరోపించారు. రాజకీయ నాయకులు, సంఘాలు పైరవీ కారుల ఒత్తిడి మేరకు అర్హత లేని వారికి అక్రమంగా నియమించారన్నారు. ఒక సబ్జెక్టుకు ఒకరిన నియమించాల్సింది పోయి ఆంగ్లం, భౌతిక శాస్త్రంలో తనకు అనుకూలంగా ఉన్న ఇద్దరేసిని నియమించారని ఆరోపించారు. ఇలాంటి డీఈఓ వైఖరి వల్ల జిల్లా విద్యాశాఖ సమాజంలోఅబసుపలవుతుందన్నారు. నియమనిబంధనలు అమలు చేయవలసిన డీఈఓ అక్రమాలకు పాల్పడుతూ తాను ఇచ్చిన నోటిఫికేషన్‌కు భిన్నంగా నియమకాలు జరిపిన డీఈఓను సస్పెండ్



చేసి నూతన డీఈఓను నియమించాలన్నారు.

గనికి అటవీశాఖ అనుమతులు ఇప్పించాలని వినతి

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-7 గనికి అటవీశాఖ అనుమతులు ఇప్పించాలని గుర్తింపు సంఘం, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కె బాజీ సైదా మాట్లాడుతూ 2020 నాటికి ఆర్కే-7 మైన్ ల్యాండ్ లీస్ పర్మిషన్ ఉందని దానిని పొడగించాలని అటవీ శాఖ అధికారులకు 2018లో లేఖలు పంపిందని, కానీ అటవీశాఖ అధికారులు ఇప్పటిదాకా అనుమతించలేదన్నారు. అటవీశాఖ అధికారులు శనివారం రోజున సింగరేణి యాజమాన్యానికి ఆర్కే-7 గనికి అటవీ శాఖ అనుమతి లేదని కాబట్టి వెంటనే ఉత్పత్తిని నిలిపివేయాలని నోటీసులు ఇచ్చారని తెలిపారు. గనిలో సుమారు 1400 మంది కార్మికులు పనిచేస్తున్నారని అలా ఉత్పత్తి నిలిపివేయడం వల్ల యాజమాన్యం కార్మికులను వివిధ గనలకు కానీ, ఇతర ప్రాంతాలకు కానీ బదిలీ చేసే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి సామాజిక దృక్పథంతో అడవులను పెంపొందించుటలో అటవీ శాఖ అధికారులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. అటవీ శాఖ అధికారుల అనుమతి వచ్చేవరకు గనిలో ఉత్పత్తి పూర్తిగా నిలిపివేయకుండా అటవీ శాఖ అధికారులచే యాజమాన్యానికి ఉత్పత్తి చేసుకునేలా అవకాశం కల్పించాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఏరియా కార్యదర్శి మారపల్లి సారయ్య, బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, నాయకులు సత్తయ్య, రాజ్ కుమార్, వంశీ పాల్గొన్నారు.

మహిళల భద్రతే షీ టీమ్ లక్ష్యం

నవతెలంగాణ-నస్పూర్

మహిళల భద్రతే షీ టీమ్ లక్ష్యమని శ్రీరాంపూర్ ఎస్ఐ సంతోష్ అన్నారు. మహిళల భద్రత పోలీసుల బాధ్యత అనే కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉజ్వల హైస్కూల్లో విద్యార్థులకు సైబర్ క్రైమ్, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో, షీ టీమ్స్, మహిళ చట్టాలు, భద్రత, ఆత్మహత్య, అమ్మాయిలను వేధింపులు, చదువుపై శ్రద్ధ, సెల్ ఫోన్ వినియోగం వల్ల ఏర్పడే అనార్థాల విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న పరిణామాల పట్ల మహిళలు, బాలికలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అమ్మాయిలని ఎవరైనా వేధింపులకు గురి చేసిన ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ చేసినట్లు అయితే వెంటనే షి టీమ్, స్థానిక పోలీసులకు ధైర్యంగా ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని అని సూచించారు. ఏటువంటి విషయాలు ఉన్న తల్లిదండ్రుల ద్వారా ధైర్యంగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. బాలికలను, మహిళలను వేధింపులకు గురి చేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని లాన్నరు. అలాగే ప్రతి స్కూల్ ఆవరణలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ గంగాధర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని పుస్పూర్ గ్రామానికి చెందిన చవాన్ మోరే లక్ష్మణ్ ఇటీవల తీవ్ర అస్వస్థతకు గురై మరణించారు. విషయం తెలుసుకున్న ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట మండల బీజేపీ నాయకులు ఉన్నారు.

ఘనంగా గోరింటాకు వేడుకలు



నవ తెలంగాణ-మందమర్రి

ఆషాడమాసం సందర్భంగా లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో ఇల్లందు క్లబ్‌లో గోరింటాకు వేడుకలు ఘనంగా నిర్వహించారు. లేడీస్ క్లబ్ ప్రెసిడెంట్ సవిత మనోహర్ ముఖ్య అతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఆషాడంలో ఆడపిల్లలు తమ చేతులకు కాళ్ళకి అందంగా గోరింటాకు పెట్టుకొంటారన్నారు. ఆషాడంలో వర్షాలు పడుతుంటాయి దీంతో వాతావరణమంతా చల్లగా మారుతుంది. క్రిములు పెరిగి రోగాలు వ్యాపిస్తాయని, వర్షాలు పడడం వల్ల వాతావరణం చల్లబడుతుంది కానీ ఒంట్లో వేడి అలానే ఉంటుంది బయట వాతావరణానికి సమానంగా మన శరీరం మారదు దీంతో సమస్యలు వచ్చే అవకాశం ఉంది. గోరింటాకులో వేడిని తగ్గించే గుణం, రోగ నిరోధక శక్తిని పెంచి రక్తప్రసరణ సక్రమంగా జరిగేలా చేస్తుందని తెలిపారు. ఈ సమయంలో గోరింటాకు పెట్టుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లేడీస్ క్లబ్ సెక్రటరి శ్రీవాణి, ట్రెజరర్ కవిత, గేమ్స్ సెక్రెటరీ ఊర్మిళ, కమిటీ మెంబర్స్ సుప్రియ, సుల్తానా పాల్గొన్నారు.

అర్జీలు త్వరితగతిన పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజావాణిలో వచ్చిన అర్జీలు త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ రాజర్షిషా, జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలదేవితో కలిసి అర్జీలను స్వీకరించారు. అనంతరం వాటిని పరిశీలించి, పరిష్కార మార్గాలను అన్వేషించాలన్నారు. ఫిర్యాదుపై తీసుకుంటున్న వివరాలను అర్జీదారునికి తెలియజేయాలని ఆదేశించారు. ప్రజావాణిలో మొత్తం వంద దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించేలా మండలాలకు నియమించబడిన ప్రత్యేక అధికారులు కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. వర్షాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశాల మేరకు ప్రత్యేక అధికారులుగా నియమించబడిన అధికారులు గ్రామాల్లో పర్యటిస్తు, వ్యాధులు ప్రబలకుండా చూడాలని అన్నారు. రోజువారి నివేదిక టూర్ డైరీ మెయింటెన్ చేయాలన్నారు. ప్రతీ నెల 5లోగా రిపోర్ట్ అందజేయాలని సూచించారు. వన మహోత్సవంలో భాగంగా ఆయా శాఖలకు కేటాయించిన లక్ష్యాలను సాధించాలని, ప్రతీ రోజూ నాటిన మొక్కల వివరాలను పోర్టల్‌లో అప్ లోడ్ చేయాలని అన్నారు.

నవతెలంగాణ కథనానికి స్పందించిన అధికారులు



నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలోని మహారాజుల కాలనీలో విద్యుత్ వైర్లకు చెట్టు తీగలు అల్లుకొని ప్రమాదకరంగా ఉన్నాయని సోమవారం నవతెలంగాణ దిన పత్రికలో వచ్చిన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. సోమవారం ప్రమాదకరంగా ఉన్న ఆ చెట్ల తీగలను తొలగించి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు విద్యుత్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

నిషేధిత గుట్కా పట్టివేత



నవతెలంగాణ-లోకేశ్వరం

అక్రమంగా తరలిస్తున్న నిషేధిత గుట్కాను పోలీసులు పట్టుకున్నారు. భైంసా నుండి లోకేశ్వరానికి బైక్‌పై తరలిస్తున్న వ్యక్తిని తనిఖీ చేసి గుట్కాను స్వాధీనం చేసుకున్నారు. గుట్కా తరలిస్తున్న వ్యక్తి భైంసాకు చెందిన అబ్దుల్ నయింగా గుర్తించి కేసు నమోదు చేశామన్నారు. అతని వద్ద నుంచి రూ.25 వేల విలువల గల గుట్కాను పట్టుకున్నట్టు ఎస్ఐ సక్రియా నాయక్ తెలిపారు.

ఏకలవ్య గురుకులంలో వైద్య శిబిరం

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకులం పాఠశాలల్లో ఏజెన్సీ డీఎంహెచ్ఓ మనోహర్ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. పాఠశాలలో నాలుగు రోజుల క్రితం శ్వాసకోశతో కొంతమంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో రిమ్స్ వైద్య నిపుణులు రఘునాథ్, వెంకట్ భార్గవ్ విద్యార్థులను పరీక్షించారు. మానసిక సమస్యలపై అవగాహన కల్పించారు. వర్షకాలంలో తీసుకునే జాగ్రత్తలను వివరించారు. వైద్య శిబిరంలో ప్రిన్సిపాల్ ఉపేందర్, పీహెచ్‌సీ వైద్యుడలు రాంబాబు, హెచ్ఈఓ తులసిదాస్, నాందేవ్, హెల్త్ సూపర్‌వైజర్లు చౌహాన్ చరణ్ దాస్, రాజమ్మ, సతవ్వ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించాలి

- విద్యుత్ శాఖ డీఈకి పొన్నారి గ్రామస్తుల వినతి



నవతెలంగాణ-తాంసి

మండలంలోని పొన్నారి గ్రామంలోని ఎస్సీ వార్డులో ఉన్న విద్యుత్ సమస్యను పరిష్కరించాలని సోమవారం ఎస్సీ వార్డుకు చెందిన పలువురు జిల్లా కేంద్రంలోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో డీఈ హరికృష్ణను కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తమ వార్డులో ప్రతిరోజు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన డీఈ వెంటనే మండల విద్యుత్ అధికారికి ఫోన్ చేసి పొన్నారి గ్రామంలోని విద్యుత్ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. తమ సమస్య పరిష్కారానికి డీఈ స్పందించడంతో ఎస్సీ కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు. డీఈని కలిసినవారిలో కాలనీవాసులు గడుగు గంగన్న, రఘు, సుభాష్, పోతన్న, అశోక్, పెంటన్న, రమాకాంత్, పోచ్చన్న, శంకర్ ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

ఉట్నూర్ : గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను ఆమె స్వీకరించారు. ఇంద్రవెల్లి మండలం సాలెగూడ గ్రామానికి చెందిన హనుమంతు తనకు విద్యుత్ కనెక్షన్ మంజూరు చేయించాలని, కాసిపేట్ మండలం మల్కాపల్లి గ్రామానికి చెందిన శశికళ తనకి ఇల్లు కావాలని, ఉట్నూర్ గ్రామానికి చెందిన మంగ దేవన్న తన చికిత్స కొరకు ఆర్థిక సాయం అందించాలని, కుమ్మరి తండా గ్రామానికి చెందిన మణి కుమార్ బర్రెల లోన్ మంజూరు చేయాలని కోరారు. ఆదిలాబాద్ మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన సాయికృష్ణ ఉన్నత చదువుల కొరకు ఆర్థిక సాయం కోరారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని పీఓ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణిలో ఏపీఓ కనక భీంరావ్, డీడీ దిలీప్ కుమార్, డీఎంజీసీ మేనేజర్ రామనందన్, అదనపు వైద్యాధికారి మనోహర్, ఏఓ రాంబాబు, ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీఓ ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి

నిర్మల్ : ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లాకలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆమె అర్జీలను స్వీకరించారు. విద్య, వైద్య, వ్యవసాయం, ధరణి, భూ సమస్యలు, డబుల్ బెడ్‌రూం ఇండ్లు వంటి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు తమ అర్జీలను అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, అలాగే సీఎం ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వసతి గృహ ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన అంశాల రిపోర్టులను అందజేయాలని ఆదేశించారు. వర్షాకాల నేపథ్యంలో ప్రతి హాస్టల్లో వైద్య శిబిరాలు నిర్వహించి, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులకు చికిత్సలు చేసి, మందులను అందజేయాలని డీఎంహెచ్ఓ డా.ధనరాజ్‌కు సూచించారు. వసతి గృహాలలో జలుబు, దగ్గు, జ్వరం వంటి లక్షణాలు ఉన్న విద్యార్థుల కోసం ప్రత్యేక విశ్రాంతి హాలును ఏర్పాటు చేయాలని, మెనూ ప్రకారం అందించే టిఫిన్, భోజనం, స్నాక్స్ తదితర వివరాలను ప్రదర్శించాలని సూచించారు.